



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 87 | ది. 4-7-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 87 | Date : 4-7-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


# ప్రముఖ సంస్థలతో ఉక్కురాష్ట్రంగా ఏపీ

- జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం
- 2028లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి
- కియా అభివృద్ధికి... బ్రాహ్మణీ స్టీల్స్ అవినీతికి నిదర్శనం
- అనంత నుంచి 90 దేశాలకు కియా కార్ల ఎగుమతి
- బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో ఐరన్ ఓర్ దోపిడీ, విదేశాలకు స్మగ్లింగ్
- సున్నపురాళ్లపల్లిలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- జేఎస్‌డబ్ల్యూ నియోఎనర్జీ, విజయనగరంలో పారిశ్రామిక ప్లాంట్‌కు శంకుస్థాపన








**కడప జిల్లా,జూలై 3 (వార్తాప్రభ) :** పరిశ్రమలు, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం సహా, ఆర్సెల్లార్ మిట్టల్, వైజాగ్ స్టీల్‌తో ఆంధ్రప్రదేశ్ ఉక్కు రాష్ట్రంగా మారుతుందని ఆయన అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపు రాళ్ల పల్లిలో జిందాల్ సౌత్ వెస్ట్ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. జేఎస్‌డబ్ల్యూ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మలతో కలిసి సీఎం ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టారు. రాయల సీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు అనుబంధంగా నిర్మిస్తున్న జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులూ సీఎం ప్రారంభించారు. ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కానుంది. ఉక్కు ఉత్పత్తి, సోలార్ ప్రాజెక్టు ద్వారా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. 3,850 మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేసేలా నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. రూ.20,350 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. జమ్మలమడుగు నుంచి విజయనగరం జిల్లాలోని జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కును కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. విజయనగరం జిల్లాలో 1,166 ఎకరాల్లో అత్యాధునిక పారిశ్రామిక పార్కును జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.531 కోట్లను జిందాల్ సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు.

**దశాబ్దల నిరీక్షణ నిజమైంది..** రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. సీఎం మాట్లాడుతూ..”రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం గురించి దశాబ్ద కాలం పాటు ఎదురు చూశాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ హామీ నెరవేరింది. రాయలసీమ అంటే ఇప్పుడు హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్- రాయల్ ఎన్ ఫీల్డ్. కియాకార్లు, హీరో బైక్స్ , డ్రోన్లు, ఫైటర్ జెట్లు, ఎలక్ట్రానిక్స్ గ్రీన్ ఎనర్జీ. సీమ ఇకపై ఏమాత్రం కరువు నేల కాదు, జలకళ ఉట్టిపడే పచ్చని ప్రాంతం. పరిశ్రమలు, రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో ఓ నవ శకం మొదలైంది. విభజన తర్వాత ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, అనుమానాలు దాటుకుని రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించాం. గత పాలకులు మోసపూరితంగా శంకుస్థాపనలు చేశారు. 2019లో ఓసారి, 2023లో మరోమారు శంకుస్థాపన, భూమి పూజలు చేశారు. ఐదేళ్ల కాలంలో శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టాం. పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో ఉక్కు ఉత్పత్తి చేస్తారు. విశాఖ ఉక్కు సంక్షోభంలో ఉన్నప్పుడు కేంద్రంతో మాట్లాడి రూ.11,440 కోట్ల ఆర్థిక సాయంతో ఆదుకున్నాం. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. జేఎస్‌డబ్ల్యూ బళ్లారి ప్లాంట్ కంటే అధిక సామర్థ్యంతో రాయలసీమ ప్లాంట్‌ను తీర్చిదిద్దాలి. గండికోట నుంచి 15 కిలోమీటర్ల మేర పైప్ లైన్ వేసి 2 టీఎంసీల నీటిని స్టీల్ ప్లాంట్ కు సరఫరా చేస్తాం. రాయలసీమ ప్రాంతంలో ఉన్న అత్యంత నాణ్యమైన ముడి ఇనుము ఖనిజాన్ని కూడా ప్లాంట్ కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం “అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.




## ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు.. కేంద్రం ఉత్తర్వులు

- నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం
- మే 4న పేర్లు ఖరారు చేసిన కొలీజియం
- కేంద్రం పరిశీలన తర్వాత ఉత్తర్వులు

**న్యూఢిల్లీ, జూలై 3 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో ఆమోదించింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది. హైకోర్టు న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రానికి పంపిస్తుంది. అనంతరం కేంద్రం పరిశీలించి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుంటుంది. అన్ని దశలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

## గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

- వివిధ అంశాలపై గవర్నర్ తో ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించిన పవన్
- అంతకుముందు సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశం
- గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై 'ఈగల్' విభాగం నివేదిక సమర్పణ
- సోషల్ మీడియా వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఐజీ వెల్లడి





**విజయవాడ,జూలై 3 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం నాడు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్ కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఈగల్' విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు. అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

## దస్తావేజులు పోయినవి

కృష్ణా జిల్లా పెడన మండలం కూడూరు శివారు కృష్ణాపురం గ్రామానికి చెందిన ఉప్పాల రాంప్రసాద్ గారికి బందరు మండలం కొత్తపూడి గ్రామంలో 3.99 ఎకరాల భూమి కలదు. ఈ భూమికి సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్ 8114/2011 గల దస్తావేజులు పోయాయి.(ఆర్ ఎస్ నంబర్ 18లో ఎ.1.50 సెంట్లు,19/7 లో ఎ.1.26 సెంట్లు 19/8లో ఎ.1.23 సెంట్లు) జులై 2 -2026 వ తేదీన కృష్ణాపురం నుంచి పెడన వెళుతుండగా మార్గ మధ్యలో జారీ పడిపోయాయి. ఈ దస్తావేజులు దొరికిన వారు ఈ క్రింది నెంబర్ కు సంప్రదించవలసిందిగా కోరుచున్నాను.

ఇట్లు : **అకూరి శ్రీనివాసరావు**

సెల్ : 7386177444

## తెలుగు రాష్ట్రాల నుండి పురందేశ్వరి కు కీలక బాధ్యతలు బండికి ప్రమోషన్

### సమూల ప్రక్షాళన..కొత్త టీం సిద్ధం..!!

**న్యూఢిల్లీ ,జూలై 3 (వార్తాప్రభ) :** ప్రధాని మోదీ కీలక నిర్ణయాలకు సిద్ధమయ్యారు. మోదీ 4.0 లో భాగంగా ప్రభుత్వం.. పార్టీలో సమూల ప్రక్షాళన దిశగా కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం లోగా నిర్ణయాలు అమలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. అందులో భాగంగా యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని డిసైడ్ అయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి బీజేపీ నేతలకు కొత్త బాధ్యతలు దక్కే అవకాశం కనిపిస్తోంది. పార్టీ- మంత్రివర్గంలో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కే విధంగా కసరత్తు కొనసాగుతోంది. బీజేపీ కొత్త జాతీయ కార్యవర్గం ఏర్పాటు పై కీలక మంత్రాంగం కొనసాగుతోంది. తాజాగా పార్టీ చీఫ్ నితిన్ నబీన్.. తాజాగా అమిత్ షా నివాసంలో సుమారు మూడు గంటల పాటు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి బీజేపీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ కూడా హాజరయ్యారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ముగ్గురు నేతల మధ్య జరిగిన చర్చల్లో కొత్త కేంద్ర బృందం రూపకల్పనతో పాటు భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై కూడా సమగ్రంగా చర్చించినట్లు సమాచారం.

## పోగురుపల్లి పారిశ్రామికవాడలో సోలార్ విద్యుత్ వ్యవస్థ ఆవిష్కరణ




**విజయవాడ, జూలై 3 (వార్తాప్రభ) :** పోగురుపల్లి పారిశ్రామిక వాడ నందు 2 కిలో వాట్స్ రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఆవిష్కరించారు. ఈ సోలార్ విద్యుత్ ప్రాజెక్టును ఎస్ఎం రీఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సమస్త ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ పథకం క్రింద విజయవంతంగా పూర్తిచేసారు. చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం, గూడుపల్లె మండలం, పోగురుపల్లి లో ఏర్పాటుచేసిన ఈ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సోలార్ విద్యుత్ వ్యవస్థ వలన 7,489 మంది ఎస్సీ/ఎస్టీ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుంది అన్నారు. ఈ ప్రాజెక్టును విజయవంతంగా సకాలంలో పూర్తి చేసిన ఎస్ ఎం రీనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ వారిని అభినందించారు. ఈ ప్రాజెక్టు దేశంలోని గ్రామస్థాయిలో నెలకొల్పిన భారీ రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ఉత్పాదక వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది అన్నారు. ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా ఎస్ ఎం రీనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ వారు పూర్తి చేయటం ద్వారా, ఈ కుప్పం నియోజక వర్గం ప్రేరణ ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర రాష్ట్రాలలోని గ్రామాలలో సోలార్ ఇంధన వ్యవస్థ స్థాపనకు మార్గదర్శి అవుతుంది అన్నారు. ఈ ప్రాజెక్టు కుప్పం నియోజక వర్గం అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తుందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యొక్క పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన క్రింద ఎస్ ఎం రీనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన ఈ ప్రాజెక్టు ప్రధానమంత్రి స్వచ్ఛ ఇంధన దార్శనికతను మరియు రాష్ట్రవ్యాప్తంగా రూఫ్‌టాప్ సోలార్ వినియోగాన్ని వేగవంతం చేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి పటిష్టమైన అభివృద్ధికి ప్రబల నిదర్శనగా చెప్పవచ్చును.

## రిషికొండ ప్యాలెస్ నుండి ప్రభుత్వానికి ఆదాయం ఉంటుందా?

**రిషికొండ పాలెస్ లను వినియోగంలోకి తీసుకువచ్చే దిశగా ఎట్టకేలకు ఓ కీలక అడుగు అయితే.పడింది. సాగర నగరం విశాఖ పర్యాటక కేంద్రంగా ఇప్పటికే ఓ రేంజికి ఎదగగా... తాజాగా కూటమి సర్కారు చేపడుతున్న చర్యల కారణంగా నగర పరిసరాలకు మరింత మేర పర్యాటక శోభ వస్తోంది. అందులో భాగంగానే రిషికొండ ప్యాలెస్ లను ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చే దిశగా ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఈ తంతు త్వరగానే ముగిసి రెండేళ్లకు పైగా వినియోగంలో లేని ఈ భవనాలు వినియోగంలోకి రావడం ద్వారా ప్రభుత్వానికి కొంతమేర అయినా ఆదాయం వస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.**



**విశాఖపట్నం,జూలై 3 (వార్తాప్రభ) :** అయితే ఈ భవన నిర్మాణాలకు గత ప్రభుత్వం ఖర్చు పెట్టిన వందల కోట్ల రూపాయల స్థాయిలో అయి-ంతే ఆదాయం వచ్చే పరిస్థితి లేదని చెప్పక తప్పదు. వైసీపీ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉండగా... మరోమారు తానే సీఎం అవుతానని కలలు గన్న ఆయన తన అదికారిక నివాసం కోసం రిషికొండను తవ్వి నిబంధనలకు విరుద్ధంగా రిషికొండ ప్యాలెస్ ను నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ భవనాల కోసం జగన్ సర్కారు ఏకంగా రూ.452 కోట్లను ఖర్చు చేసింది. అయితే జగన్ పాలన నచ్చని ఏపీ జనం... ఐదేళ్లకే జగన్ ను గద్దె దించేశారు. వెరసి రిషికొండ ప్యాలెస్ లోకి ఆయన అడుగు కూడా పెట్టలేకపోయారు. జగన్ తన కోసం నిర్మించుకున్న ఈ భవనాల వినియోగం ఆ తర్వాత వచ్చిన కూటమి సర్కారుకు పెను సవాల్ గానే మారింది. రెండేళ్ల పాటు ఈ భవనాలను ఏం చేయాలన్న దిశగా ఆలోచించిన కూటమి ప్రభుత్వం తాజాగా ఈ భవనాలను ఆతిథ్య రంగంలోని సంస్థలకు లీజుకు ఇచ్చే దిశగా కీలక అడుగు వేసింది. అత్యంత ఆధునిక వసతులతో రాజ వైభోగం తలపించేలా జగన్ నిర్మించిన ఈ భవనాలను ఇదివరకే ఆతిథ్య రంగంలోకి పలు సంస్థలు పరిశీలించాయి. అయితే ఓ సీఎం కోసం నిర్మించుకున్న ఈ భవనాలను పర్యాటకంగా వినియోగించుకునేందుకు పనికి రావని ఆయా సంస్థలు తేల్చేశాయి. తాజాగా ఈ భవనాలను ఎలాగైనా వినియోగంలోకి తీసుకురావాలన్న దిశగా ఆలోచించిన కూటమి సర్కారు.. ఈ భవనాలను లీజుకు తీసుకుంటే వాటికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని కూడా లీజుకు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ అడుగు ఫలితం ఇచ్చేసింది. రిషికొండ ప్యాలెస్ ఆపరేషన్, మెయింటెనెన్స్ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ కు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పర్యాటక సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తమైంది. రిషికొండ ప్యాలెస్ దాని పరిసరాల్లోని భూముల లీజు, ఆ భూముల్లో ఇతరత్రా కట్టడాల నిర్మాణం, వాటి ఆపరేషన్ లకు సంబందించిన బిడ్లను జూలై 10లోగా దాఖలు చేయాలని తాజాగా ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ కు మంచి స్పందన లభిస్తుందన్న వాదనలు అయితే బలంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ బిడ్లు ఏ మేర.. అంటే ఏ ధరకు ఆయా సంస్థలు రిషికొండ ప్యాలెస్ లను అద్దెకు తీసుకుంటాయన్న విషయం ఆసక్తిగా మారింది. ఎంత ఎక్కువ ధర వచ్చినా కూడా రిషికొండ ప్యాలెస్ నిర్మాణ ఖర్చులో లేశమాత్రమే ఇప్పుడు వస్తుందని, ఇదే లీజు ఏళ్ల తరబడి కొనసాగితే తప్పించి.. వాటి నిర్మాణానికి అయిన ఖర్చు వెనక్కు రాదని చెప్పక తప్పదు.

## ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కు వక్ఫ్ బోర్డు నోటీసులు

### “వార్తాప్రభ” కథనం పై స్పందన

- అక్రమ రిజిస్ట్రేషన్‌పై వివరణ కోరిన అధికారులు




**ఇబ్రహీంపట్నం, జూలై 3 (వార్తాప్రభ) :** కొండపల్లి పట్టణంలోని సర్వే నంబర్ 293/1లో ఉన్న వక్ఫ్ బోర్డు భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులు స్పందించారు. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ చట్టవిరుద్ధమని పేర్కొంటూ, వక్ఫ్ చట్టం--1995 ప్రకారం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరిస్తూ ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీ చేశారు.కొండపల్లి పట్టణంలోని సర్వే నంబర్ 293లో ఉన్న హజరత్ ముర్తుజా అలీ పంజా వక్ఫ్ బోర్డు భూమిని విక్రయిస్తామని చెప్పి కరణం సు-ధీర్ కుమార్ అనే వ్యక్తి తన వద్ద నుంచి రూ.18 లక్షలు తీసుకున్నారని, అనంతరం అదే భూమిని వేరే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారని బాధితుడు వేణు జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా కు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై “వార్తా ప్రభ” పత్రికలో వార్త ప్రచురితమైంది. హజరత్ ముర్తుజా అలీ పంజాకు చెందిన 1,800 చదరపు గజాల పీర్లపంజా చావిడి, దానికి అనుబంధంగా ఉన్న శాంతినగర్‌లోని సర్వే నంబర్లు 212ఏ, 212బీలోని 18.30 ఎకరాల వక్ఫ్ భూములకు ఇష్టానుసారంగా పన్నులు విధిస్తూ, సర్వే నంబర్లు మార్చి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అల్తాఫ్ బాబా ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

## పెడనలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే కాగిత



**పెడన,జూలై 3 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం తోటముల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లో వివిధ సమస్యలు రెవిన్యూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు నుండి వినతులను స్వీకరించారు ప్రజలు ఇస్తున్న వినతులపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా జవాబుదారీతనం ఉండటం ముఖ్యమని ఈ సందర్భంగా సూచించడం జరిగింది. ముఖ్యంగా ప్రజలు ఇచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలు గురించి సమాచారం చేరవేయాలని అధికారులను ఆదేశించారు.

## సొంత నిధులతో నిర్మించిన స్కూలు తరగతి గదిని ప్రారంభించిన దాసరి సత్యం




**పెడన,జూలై 3 (వార్తాప్రభ) :** పెడన మండలం బలిపర్రు గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు నూతన అదనపు తరగతి భవనం ఏర్పడింది. గ్రామానికి చెందిన జనసేన నాయకుడు వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి సత్యనారాయణ ఈ అదుపు తరగతి గదిని తన సొంత నిధులు రూ.3.25 లక్షలు తో నిర్మించారు. ఈ గదిని ఆయన తన స్వహస్తాలతో శుక్రవారం నాడు ప్రారంభించారు. అలాగే సాయి ఎడ్యుకేషనల్ అండ్ హెల్త్ కేర్ ట్రస్ట్ వారు 2 లక్షలరూపాయలు తో నిర్మించిన ఆర్ ఓ ప్లాంట్ ను కూడా ప్రారంభించారు. పూర్వ విద్యార్థి అయిన సత్యనారాయణ పలువురు అభినందించారు. ఈసందర్భంగా దాసరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖాధికారులు హరినాద్ సలోమి ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీపీ. వెలివెల



**కృత్తివెన్ను,జూలై 3 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి మరియు చినతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు మండల ప్రజా పరిషత్ స్కూల్ చిన తుమ్మిడి లను సందర్శించిన బంటు మిల్లి ఎంపీపీ వెలివెల చిన్నబాబు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న పేషంట్లను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది జ్వరం మరియు విరోచనాలతో హాస్పటల్లో ఉన్న పేషంట్లను కలుసుకుని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాబిస్ మరియు పాము కాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సువచ్చలకు తెలియజేయడం జరిగింది అనంతరం మండల ప్రజా పరిషత్ పాఠశాల చిన తుమ్మిడి పెల్లి పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు మరియు మధ్యాహ్న భోజనం ను పరిశీలించడం జరిగింది పిల్లల సంఖ్య క్రిత సంవత్సరం కంటే తగ్గటం ఆందోళనకరం గా ఉందని గవర్నమెంట్ స్కూల్లో చదివే విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని ఎంపీపీ కోరారు మధ్యాహ్నం భోజనం పథకంలో కొంతమంది పిల్లలు బాక్సులు తెచ్చుకోవడంపై ఆరాతీసి అందరూ స్కూల్లోనే భోజనం చేసేలా కృషి చేయాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు....

## పీ7 ప్రో సీరీస్‌ను పరిచయం చేసిన "హేయర్ ఇండియా"




**విజయవాడ, జూలై 3 (వార్తాప్రభ) :** వరుసగా 17 సంవత్సరాలు ప్రపంచంలో నంబర్ 1 గ్లోబల్ మేజర్ అప్లయెన్సెస్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన హేయర్ అప్లయెన్సెస్ ఇండియా, తన పూర్తి కొత్త హెచ్ క్యూఎల్ఈడి పీ7 ప్రో సీరీస్‌ను లాంచ్ చేసి హోమ్ ఎంటర్‌టెయిన్‌మెంట్ రంగంలో కొత్త మైలురాయి స్థాపిస్తోంది. ఈ తదుపరి తరం స్మార్ట్ టీవీ సిరీస్ అత్యుత్తమ సౌండ్, అద్భుతమైన పిక్చర్ క్వాలిటీ మరియు ఏఐ చాలిత అనుభవాలను అందించడానికి రూపొందించబడింది. దీని కేంద్రంలో ఒక శక్తివంతమైన సినిమా గ్రేడ్ 50 డబ్ల్యూ 2.1 చానెల్ స్పీకర్ సిస్టమ్ ఉంది. ఇంటిగ్రేటెడ్ సబ్‌వూఫర్‌తో సహా ఇది లోతైన బాస్, స్పష్టమైన వోకల్స్ మరియు గదిని నింపే సమృద్ధమైన శబ్దాన్ని అందించి ప్రతి సినిమా, మ్యాచ్ మరియు సంగీత ప్రదర్శనను మరింత అద్భుతంగా మారుస్తుంది. డాల్బీ అట్మాస్ మరియు టోటల్ సోనిక్స్ ఆడియో ఎన్‌హాన్స్‌మెంట్‌తో కలిసి, హెయిర్ ఇండియా పీ7 ప్రో సీరీస్ నిజమైన సినిమాటిక్ ఆడియో అనుభవాన్ని అందించి తన విభాగంలో కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతోంది. పీ 7 సీరీస్ హెచ్ క్యూ ఎల్ ఈ డి డిస్‌ప్లే సాంకేతికత ద్వారా నడిచే అద్భుతమైన విజువల్స్‌ను అందిస్తుందని హేయర్ అప్లయెన్సెస్ ఇండియా ఎస్. ఎస్. సతీష్ తెలిపారు.

# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి

### -ఎన్టీఆర్ జిల్లా దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి డిమాండ్



**విజయవాడ సెంట్రల్,జూలై 3 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ లో జీవో ఎంఎస్-396తో ప్రకారం రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు(ఆర్.ఎస్. కే.) ఏర్పాటును ఎన్టీఆర్ జిల్లా దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. అందులో భాగంగా శుక్రవారం విజయవాడ గాంధీనగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలి ఎదుట దస్తావేజు లేఖరులు, అసిస్టెంట్లు, డిటిపి ఆపరేటర్లు,స్టాంప్ వెండర్లు నల్లబ్యాడ్జిలు ధరించి రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమంలి చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చింతకాయల నాగ సత్యనారాయణ మూర్తిలి పాల్గొని మాట్లాడుతూ ఎక్కడో మహారాష్ట్రలో అది కూడా ముంబై,పూనే నగరాల్లో మాత్రమే ఈ తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి లీజు,తనఖా వంటి రిజిస్ట్రేషన్లు మాత్రమే చేస్తున్నారని కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాల రిజిస్ట్రేషన్లు చేయడానికి రంగం సిద్ధం చేస్తూ ,దస్తావేజు లేఖర్ల పొట్ట కొట్టడం భావ్యం కాదని తెలిపారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రముల ఏర్పాటు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, అలా ఉపసంహరించుకోకుంటే భవిష్యత్తులో తాము మరిన్ని నిరసన కార్యక్రమాలను చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి అధ్యక్షులు పైలా సతీష్ మాట్లాడుతూ తాము అభివృద్ధికి, టెక్నాలజీకి ఎప్పుడు వ్యతిరేకం కాదని కానీ రిజిస్ట్రేషన్ & స్టాంపుల శాఖకు అనుబంధంగా తాము 100 సంవత్సరాలకు పైబడి దస్తావేజు లేఖర్లగా సేవలందిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో ఎన్ని కొత్త తరహా విధానాలు తీసుకొచ్చిన వాటన్నింటినీ నేర్చుకొని అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ, చట్టపరంగా దస్తావేజులు రాస్తూ, ప్రభుత్వానికి,ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. అయితే ప్రస్తుతం పిపిపి విధానంలో ఈ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల్లో కొత్తవారికి ట్రైనింగ్ ఉపయోగించుకోవడం కన్నా, ఎంతో అనుభవం నైపుణ్యం గల దస్తావేజు లేఖర్లకు లైసెన్సులు/ఐడెంటిటీ ఇచ్చి తమ జీవన భృతిని కొనసాగించుకునే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ గాంధీనగర్ దస్తావేజు లేఖరులు ఎం చక్రధర్,వి వరహాల రావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు,నరేంద్ర, కాజా రమేష్,సూర్యనారాయణ పలువురు యువ దస్తావేజు లేఖరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**తిరువూరు,జూలై 3 (వార్తాప్రభ) :** తిరువూరు నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు గారు ఈరోజు తిరువూరు లోని తమ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) 29వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ విడతలో 134 మంది లబ్ధిదారులకు సుమారు రూ.56 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడిన గౌరవ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు గారు, ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తూ వైద్య చికిత్సలు, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. బిశాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, తిరువూరు నియోజకవర్గంలో లిఇప్పటివరకు 29 విడతల్లో మొత్తం 1,140 మంది లబ్ధిదారులకు రూ.8,20,43,654 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. బిఅలాగే, ప్రజల కష్టాలను అర్థం చేసుకుని అవసరమైన సమయంలో వెంటనే స్పందిస్తూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరువూరు నియోజకవర్గానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. బిగత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొన్నారని, అనేక దరఖాస్తులు వచ్చిన పట్టించుకోలేదని శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర కూటమి ప్రభుత్వం పారదర్శక విధానంలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా చర్యలు తీసుకుంటోందని, కోట్ల రూపాయల విలువైన సహాయాన్ని ప్రజలకఅందిస్తున్నామని తెలిపారు. బిప్రజలకు అవసరమైన ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకం సకాలంలో అందేలా తాము నిరంతరం కృషి చేస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయనిధికి అర్హులైన ప్రతి ఒక్కరూ తమ కార్యాలయాన్ని సంప్రదించాలని గౌరవ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేయడం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందుకున్న లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లిగౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారికి, అలాగే తమ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్న తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవత్వానికి చిరునామా బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు

**• అనాథ అంకాలయ్య యస్ టి ఎరుకల కు అండగా నిలిచి శస్త్రచికిత్స చేయించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ -- దాతల సహకారానికి కృతజ్ఞతలు**



**గిద్దలూరు,జూలై 3 (వార్తాప్రభ) :** కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమని మరోసారి నిరూపించారు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు మార్కాపురం జిల్లా గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ పంచాయతీలోని అంకాలమ్మపల్లె గ్రామానికి చెందిన నల్లగుంట్ల అంకాలయ్య యస్ టి ఎరుకల దుర్భర పరిస్థితిని తెలుసుకుని ఆయనకు అండగా నిలిచి మెరుగైన వైద్యం అందేలా కృషి చేశారు. చిన్నతనంలోనే స్వగ్రామాన్ని విడిచి గుంటూరులో వంట మాస్టర్‌గా జీవనం సాగించిన అంకాలయ్యకు ఇటీవల జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో తుంటి ఎముక విరగడంతో మంచానికే పరిమితమయ్యాడు. ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని గ్రామస్థులు, టీడీపీ యువ నాయకుడు మరిబోయిన వీరశేఖర్, బోగిరి తిరుపాలయ్య టీచర్ ద్వారా తెలుసుకున్న బి యస్ నారాయణరెడ్డి వెంటనే అంకాలమ్మపల్లెకు చేరుకుని బాధితుడిని పరామర్శించారు. తొలుత గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చేర్పించారు. వారం రోజులపాటు వైద్య పరీక్షల అనంతరం దాతల ఆర్థిక సహాయంతో తుంటి ఎముకకు విజయవం తంగా శస్త్రచికిత్స నిర్వహించారు. గత పది రోజులుగా అంకాలయ్యకు దగ్గరుండి సేవలందించిన బి యస్ నారాయణరెడ్డి సేవలను గ్రామ స్థులు హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా బి యస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ అంకాలయ్యకు సేవ చేసే అవకాశం కల్పించిన అంకాలమ్మపల్లె గ్రామ యువకులు, గ్రామస్థులు, ఆర్థిక సహాయం అందించిన మిత్రులు దాతలు, వైద్యులు,సంబంధిత అధికారులు, మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తాను ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్, జి.హెచ్.ఆర్.ఏ.సి.సి.పి.సి.ఐ మానవ హక్కుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా సమాజ సేవను కొనసాగిస్తున్నానని పేర్కొన్నారు. నల్లగుంట్ల అంకాలయ్యకు ఇంకా వారం రోజుల పాటు ఆసుపత్రిలో వైద్య సేవలు అవసరమని, చికిత్స పూర్తయ్యే వరకు అదనపు ఆర్థిక సహాయం అవసరముందని తెలిపారు. మానవత్వంతో స్పందించే దాతలు ముందుకు వచ్చి సహకరించాలని బి యస్ నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. "మనిషికి మనిషే తోడు అవసరంలో అండగా నిలవడమే నిజమైన సేవ" అనే సందేశాన్ని ఈ సేవా కార్యక్రమం మరోసారి చాటిచెప్పిందని గ్రామస్థులు పేర్కొన్నారు. 9441932390 సంప్రదించాలన్నారు

# జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యం

### -సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్



**విజయవాడ, జూలై 3 (వార్తాప్రభ) :** విజయ-వాడ పార్లమెంట్ పరిధిలో ఎన్టీఆర్ జిల్లాలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నానని సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ అన్నారు. ఈ సందర్భంగా నేడు సుమారు 200 మంది జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మహిళలతో కలిసి నిర్మల కాన్వెంట్ నుండి కెపి నగర్ లోని మంత్రి కందుల దుర్గేష్ వారి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ సభ్యులకు, అనంతరం పార్టీ ఇచ్చిన దరఖాస్తును స్వయంగా మంత్రి కందులు దుర్గేష్ కి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం మంచి పని చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకి కచ్చితంగా సముచిత పదవి ఇచ్చి పార్టీలో గౌరవం వచ్చేలాగా స్వయంగా పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. ప్రతిరోజు వీడియో కాన్ఫరెన్స్ ల ద్వారా ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వయంగా పర్యవేక్షించి పార్టీ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తల నుండి నాయకులనుండి వచ్చిన విశేష స్పందన మూలముగా ఐదో తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని పొడిగించినట్లు తెలిపారు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ మాట్లాడుతూ పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవాడ నగరంలో నా వంతుగా విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించానని తెలిపారు. మీడియా డిబేట్లో ద్వారా విలేకరుల సమావేశాల ద్వారా ఘాటుగా స్పందించి వాటిని తిప్పి కొట్టడంలో నా వంతుగా పార్టీకి సేవలు అందిస్తున్నానని తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా విజయవాడ నగరంలో అన్ని వర్గాల ప్రజలకు పార్టీ సిద్ధాంతాలను చేరవేరుస్తూ పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సమతం సత్తిబాబు, నాంచారయ్య, జనసేన పార్టీ యువత వీర మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

### -సొసైటీ చైర్మన్ మోర్ల వెంకట రోశాలు

**• చంద్రగూడెం సొసైటీలో సహకార వారోత్సవాలు**



**మైలవరం(చంద్రగూడెం),జూలై 3 (వార్తాప్రభ) :** రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని మైలవరం మండల పరిధిలోని చంద్రగూడెం పీఏసీఎస్ చైర్మన్ మోర్ల వెంకట రోశాలు రైతులకు సూచించారు. శుక్రవారం సొసైటీలో సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎల్ నినో వాతావరణ పరిస్థితుల్లో చేపటవలసిన చర్యలు, జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు వాడకాన్ని తగ్గించుకోవాలని, వాతావరణం కనుకూలతను బట్టి పంటలు సాగు చేసుకోవాలని తెలియజేశారు. మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కె. సంధ్యారాణి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏవో టెక్నికల్ అధికారి వాసుదేవ్,చంద్రగూడెం గ్రామ రైతులు, జెడ్ బి ఎన్ ఎఫ్ శాంత కుమారి, రైతులు పిఎసిఎస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వావిలాల గ్రామంలో గొడ్డలితో ఇంట్లోకి ప్రవేశించి దాడి చేయబోయిన వ్యక్తిని అరెస్ట్

**• రిమాండ్ కు తరలించిన పోలీసులు**



**తిరువూరు,జూలై 3 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం వావిలాల రాత్రి సమయంలో ఒక తెలిసిన వ్యక్తి గొడ్డలితో ఇంటిలోకి ప్రవేశించి దాడి చేశాడని దుగ్గిరాల నాగరాజు అను వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి ముద్దాయి అయినా దుగ్గిరాల రమేష్ బాబు అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు తరలించిన తిరువూరు పోలీసులు. ఈ సందర్భంగా తిరువూరు పోలీసులు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, అల్లర్లు లేదా గొడవలు చేసేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలియపరిచినారు.

## ఒక నెల ఒక గ్రామం గ్రామ సమస్యల పరిష్కార వేదిక

**• మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి**




**విస్సన్నపేట,జూలై 3 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో ఒక నెల ఒక గ్రామం నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి తమ సిబ్బందితో గ్రామ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.

## నేడు, రేపు గుడ్లవల్లేరులో ఉచిత మెగా వైద్య శిబిరం...



**గుడ్లవల్లేరు,జూలై 3 (వార్తాప్రభ) :** మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాజిలిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శని, ఆదివారాలు ఉచిత వైద్య శిబిరాల్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో పలువురు వైద్యులు ఎముకలు, కీళ్లు, నడుము, దంత, గుండె, హోమియో, బీపీ, షుగర్, థైరాయిడ్, సాధారణ, మానసిక, నేత్ర వైద్య పరీక్షల వంటి వైద్యాన్ని ప్రముఖ హాస్పటల్స్‌లోని వైద్య నిపుణులచే అందించనున్నారని డాక్టర్ వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు ఉచిత మందులను కూడా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

## శ్రీ వేంకటేశ్వరుని భక్తకోటికి విస్తృత ఏర్పాట్లు...



**గుడ్లవల్లేరు,జూలై 3 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని శనివారం దర్శించుకోనున్న భక్తకోటికి శుక్రవారం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి జరిగే ప్రత్యేక పూజలు, విశేషాభిసేకాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వేలాది భక్తులు విచ్చేస్తున్న ఈ ఆలయంలో మండు వేసవిలో భక్తులెవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మంచినీటితో పాటు అన్నసమారాధన ఏర్పాట్లను బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు పర్యవేక్షిస్తున్నారు.

## 79 వ సీనియర్ నేషనల్ ఛాంపియన్ షిప్ 2026 పోటీలకు తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టు

**యూనిఫామ్ టీమ్ కిట్ ని అందించిన 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్**

**జులై 7 నుంచి 12 వరకు చెన్నై కట్ట న్ కుళత్తూర్ డాక్టర్ టి. పారివేందర్ ఆక్వాటిక్ కాంప్లెక్స్ లో పోటీలు**



**హైదరాబాద్ జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర సీనియర్ వాటర్ పోలో జట్టు సీనియర్ నేషనల్స్ పోటీలకు సిద్ధమైంది. తెలంగాణ వాటర్ పోలో టీం 2026 జులై 7 నుంచి జులై 12 వరకు చెన్నై కట్ట న్ కుళత్తూర్ డాక్టర్ టి. పారివేందర్ ఆక్వాటిక్ కాంప్లెక్స్ లో నిర్వహించనున్న 79వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ లో పాల్గొంటారు. తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టుకు, మేనేజర్ అండ్ కోచ్ లకు శుక్రవారం గచ్చిబౌలి ఆక్వాటిక్ స్టేడియంలో యూనిఫామ్, టీషర్ట్స్ కిట్ అందించారు. ఈ ఈవెంట్ కిట్ ని 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ స్పాన్సర్ చేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ నేషనల్స్ వాటర్ పోలో టీమ్ , స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి . చంద్ర శేఖర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి జి . ఉమేష్ , 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ ఎండీ ఎల్. ఎం శంకర్ , టీం మేనేజర్ టి కిరణ్ కుమార్ , ఐ బాల మల్లేశ్వర్, వాటర్ పోలో కోచ్ తిరుపతి , ఆయుష్ యాదవ్, బాలాజీ పాల్గొన్నారు. సీనియర్ నేషనల్స్ వాటర్ పోలో జట్టు ఎంపిక ట్రయల్స్ అంబర్‌పేట్ లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన 11వ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ లో నిర్వహించారు.

## ఓటర్ నమోదులో... ప్రజలంతా భాగస్వాములు అవ్వాలి.

**జవహర్ నగర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండలు ముదిరాజ్.**



**జవహర్ నగర్, జులై 3: (వార్తా ప్రభ)** ఓటర్ నమోదులో ప్రజలంతా భాగస్వాములు అవ్వాలని పారదర్శకతతో కూడిన జాబితా యే లక్ష్యంగా బిఆర్ఎస్ నాయకులు పనిచేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండలు ముదిరాజ్ అన్నారు .ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్ నగర్ లో పలు బూత్ లను పార్టీ కార్యకర్తలుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కొండలు ముదిరాజ్ మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియ ప్రభుత్వ అధికారులతో సవ్యంగా జరుగుతుందని జవహర్ నగర్ లోని ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరు నమోదు ప్రక్రియలో తమ పేరును నమోదు చేసుకొని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు తమ ఓటు హక్కును నమోదు చేసుకొని దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని ఆ వజ్రాయుధాన్ని ప్రజలు సక్రమంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పది కాలాల పాటు పరిఢమిల్లుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగన బాలరాజు పటేల్, వెంకటేష్, సోమయ్య, భాస్కర్, కిరణ్, మహిళా కమిటీ సభ్యులు బి ఎల్ వోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌కు శ్రీకారం!!

**ప్లాస్టిక్‌కు బదులు స్టీల్ వస్తువుల వినియోగం**

**విద్యార్థులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ**

**ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని అవగాహన**




**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 3 (వార్తాప్రభ):**ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా పిలుపునిచ్చారు. శుక్రవారం కళాశాల ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్లాస్టిక్ భూతాన్ని పారదోలుదాం -- పర్యావరణాన్ని కాపాడుదాం" అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, హైదరాబాద్‌తో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కళాశాల నాంది పలుకుతోందన్నారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిళ్లకు పూర్తిగా స్వస్తి చెప్పి వాటి స్థానంలో స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు, స్టీల్ వాటర్ బాటిళ్లను వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎకో క్లబ్ సభ్యులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ స్వచ్ఛందంగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు, స్టీల్ వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసి ఎకో క్లబ్ తరపున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా కళాశాలలో పర్యావరణహిత జీవన విధానాన్ని ప్రోత్సహిస్తూ ప్లాస్టిక్ రహిత క్యాంపస్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

# జీవో-17 రద్దుకు బీఆర్ఎస్ ధర్నా!!

**● గురుకుల విద్యార్థులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది ● స్థానిక కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతోంది ● చేనేత కార్మికులకు న్యాయం చేయాలి ● టీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష డిమాండ్**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 3 (వార్తాప్రభ):**తెలంగాణ గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జీవో-17 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడిచినా విద్యార్థులకు యూనిఫాంలు, నోట్‌బుక్స్ వంటి కనీస అవసరాలు కూడా అందకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. జీవో-17 అమలుతో రాష్ట్రంలోని చిన్న కాంట్రాక్టర్లు, చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతుండగా, తెలంగాణ సంపద ఇతర రాష్ట్రాలకు తరలిపోతోందని అన్నారు. చేనేత కార్మికులకు దక్కాల్సిన పనులను గుజరాత్‌కు చెందిన కంపెనీలకు అప్పగించడం వెనుక భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. గురుకులాల్లో జరుగుతున్న అక్రమాలపై పోరాడుతున్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రతను రాజకీయ కక్షతో తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, హైకోర్టు ఆదేశాలను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యార్థులకు అందించే ట్రంక్ పెట్టెల కాంట్రాక్టును డ్రగ్స్ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అప్పగించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శిస్తూ వెంటనే జీవో-17ను రద్దు చేసి స్థానిక కాంట్రాక్టర్లు, చేనేత కార్మికులకు న్యాయం చేయాలని, గురుకుల విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నాలో పాల్గొన్న దాసరి ఉషతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీరం రవి, బండ నిఖిల్, రాహుల్, అజీమ్, కన్నం శ్రావణ్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం!!

**● రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ● వ్యాపారాభివృద్ధికి పూర్తి సహకారం హామీ**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జులై 3 (వార్తాప్రభ):**గోదావరిఖని చౌరస్తాలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించిన ఆయన అనంతరం కాంప్లెక్స్‌లోని వివిధ దుకాణాలను సందర్శించి వ్యాపారులతో ముచ్చటించారు. కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభించిన యజమానులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరిఖని పట్టణంలో వాణిజ్య రంగం వేగంగా అభివృద్ధి చెందుతుండటం శుభపరిణామమన్నారు. కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యాపార సముదాయాలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూర్చడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచుతాయని తెలిపారు. వ్యాపారులు నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. రామగుండం నియోజకవర్గంలో వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన పూర్తి సహకారం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే ఆధునిక వ్యాపార కేంద్రాలు మరింత పెరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొని నూతన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# నిద్రిస్తున్న తల్లి ఓడి నుంచి శిశువును అపహరించి 1.50 లక్షలకు విక్రయించిన ముఠా అరెస్ట్




**శేరిలింగంపల్లి,జులై 3 (వార్తాప్రభ):**లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తున్న తల్లి ఒడి నుంచి నెల వయసున్న శిశువును అపహరించి రూ. 1.5 లక్షలకు విక్రయించిన అంతర్రాష్ట్ర చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాను చందానగర్ పోలీసులు మూడు రోజుల్లోనే అరెస్టు చేశారు. చిన్నారిని సురక్షితంగా తల్లికి అప్పగించారు. జూన్ 30 తెల్లవారుజామున బీదర్ జిల్లా బాల్కి గ్రామానికి చెందిన శాంతాబాయి లింగంపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై నిద్రిస్తుండగా ఇద్దరు దుండగులు ఆటోలో వచ్చి ఆమె ఒడిలోని పాపను ఎత్తుకెళ్లారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ఆర్సీ పురం ఏసీపీ సీహెచ్.వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి వందలాది సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుల జాడను గుర్తించాయి. విచారణలో కోల్‌కతాకు చెందిన రహనుమా అలీకి సంతానం లేకపోవడంతో హైదరాబాద్‌లోని పరిచయస్తుల ద్వారా శిశువును తెప్పించుకునేందుకు కుట్ర పన్నినట్లు తేలింది. వికారాబాద్‌కు చెందిన మహ్మద్ జుబేర్, మహ్మద్ ఇర్ఫాన్ పాపను అపహరించి నేరేడ్‌మెట్‌లోని నాజియా ఇంట్లో దాచినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం రూ. 1.5 లక్షలకు విక్రయించి కోల్‌కతాకు తరలించేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు దాడి చేసి పాపను రక్షించారు. ఈ కేసులో మహ్మద్ జుబేర్, మహ్మద్ ఇర్ఫాన్, నాజియా, నిమ్మి జహానీ అలియాస్ సీమ, రహనుమా అలీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చిన్నారిని తల్లి శాంతాబాయికి అప్పగించారు. కేసును మూడు రోజుల్లో ఛేదించిన చందానగర్ పోలీసులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# కోకపేట్ యాదవ విద్యార్థుల వసతి గృహ భవనాన్ని ప్రభుత్వం తక్షణం ప్రారంభించాలి.

**బి.సి.నేత బేరి రామచంద్ర యాదవ్ డిమాండ్**



**హైదరాబాద్, జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కోకాపేటలో యాదవ విద్యార్థుల వసతి కోసం నిర్మించిన భవనాన్ని ప్రారంభించేందుకు తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ శేర్లింగంపల్లి లోని బీసీ కార్యాలయంలో బేరి రామచంద్ర యాదవ్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోకపేట్ లో యాదవ విద్యార్థుల వసతి గృహం కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించి అప్పటి మంత్రి అయిదు కోట్లతో నిర్మాణాన్ని పూర్తి చేశారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత భవనం ప్రారంభించడానికి ఏ ఒక్కరు చొరవ చూపడం లేదన్నారు. 2018 లో అప్పటి ప్రభుత్వం బీసీ కులాలతో పాటు మిగతా కుల సంఘాలకు అందరికీ ఉప్పల్ భగాయత్ కోకాపేటలో కుల సంఘాల భవనాల గురించి భూములు కేటాయించడం జరిగిందన్నారు. కమ్మ కులానికి 10 ఎకరాలు, వెలమ కులానికి 5 ఎకరాలు, మిగతా వెనుకబడిన ముదిరాజులకు ఐదు ఎకరాలు, యాదవ కులానికి 5 ఎకరాలు ఈ విధంగా అన్ని కులాలకు భూములు కేటాయించడం జరిగిందన్నారు. అయితే యాదవ విద్యార్థుల వసతిగృహం విషయంలో ప్రభుత్వం నాన్పుడు ధోరణి వ్యవహరిస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చొరవ చూపి, యాదవ సంఘాల నాయకులు సంఘటితమై భవన ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా కుల సంఘాల భవనాలు నిర్మాణం జరిగితే 33 జిల్లాల నుండి విద్యార్థులు ఉండటానికి వసతికి ఇంతగానో ఉపయోగపడుతుంది అన్న విషయాన్ని భేరి గుర్తు చేశారు. అందుకని యాదవ పెద్దలు రేవంత్ రెడ్డి ని ఆహ్వానించి ప్రస్తుతం ఉన్న భవనాన్ని ప్రారంభోత్సవం చేసుకొని హాస్టల్ గురించి ఇతరత్రా నిర్మాణాల గురించి నిధులు కోరాలని యాదవ్ పెద్దలకు బేరి రామచంద్ర యాదవ్ సూచించడం జరిగింది.

# వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా శ్రీనివాస్ బాబు



**కూకట్ పల్లి, జూలై 3(వార్తాప్రభ):** నూతనంగా ఏర్పడిన వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కిలారు శ్రీనివాస బాబు శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్, డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ అధికారిక పూర్వకంగా ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా నియమితులైన కిలారు శ్రీనివాస బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో నిజాయితీగా కష్టపడి పని చేసే నాయకులకు, కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని మరోసారి రుజువైందన్నారు. తనపై ఎంతో నమ్మకంతో నూతనంగా ఏర్పడిన వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్ కు, డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ కు, పిసిసి ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ లతో పాటు తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చెయకుండా డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి పార్టీ పటిష్టకు కృషి చెస్తానన్నారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి!!

**ఎస్ఐఆర్--బీఎల్ఏలతో సమీక్ష**

**ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు చేయాలని పిలుపు**

**టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 3 (వార్తాప్రభ):**గోదావరిఖనిలోని రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్--బీఎల్ఏ ఇంచార్జులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో పేర్ల సవరణ, చిరునామా మార్పులు, పేర్లు గల్లంతైన వారి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా బీఎల్ఏలు చొరవ చూపాలని అన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును సక్రమంగా పూర్తి చేసి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పని చేయాలని సూచించారు. ప్రజల్లో ఉన్న సందేహాలను ఓర్పుతో నివృత్తి చేస్తూ వారికి అవసరమైన సహకారం అందించాలని చెప్పారు. సేవాభావంతో పనిచేసే కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రతి పోలింగ్ కేంద్రంలో సమన్వయంతో పనిచేస్తే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకుండా ప్రతి నాయకుడు, ప్రతి బీఎల్ఏ అప్రమత్తంగా పనిచేయాలని దుద్దిళ్ల శ్రీను బాబు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, వివిధ డివిజన్లు, గ్రామాల ఎస్ఐఆర్--బీఎల్ఏ ఇంచార్జులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సప్తగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి నూతన ఆలయంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ట మహోత్సవం

**- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,జులై 3 (వార్తాప్రభ):**మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ కాలనీలో గల సప్తగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి నూతన ఆలయంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అయ్యప్ప సొసైటీ వాసులు మధుసూదన్ రెడ్డి, కేవీ రావు, వాసు, మామిడాల రాజు, పరమేశ్వర్‌తో పాటు కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సర్పంచ్ ... పుట్టినరోజు వేడుకలు.

**పేదల ఆశాజ్యోతికి జన్మదిన శుభాకాంక్షలు: బుడిద వెంకటేష్.**



**జవహర్ నగర్, జులై 3: (వార్తా ప్రభ)** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి నిరంతరం గరీబోళ్లకు నేనున్నానంటూ ఆపదలో ఆదుకునే ఆపన్న హస్తం మన కారింగుల శంకర్ గౌడేనని సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్ తెలిపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్ శంకర్ గౌడ్ కు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పెన్నిధి జవహర్ నగర్ రూపశిల్పి కారింగుల శంకర్ గౌడ్ మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు ఎల్లవేళలా ఆపన్న హస్తంలా నేనున్నానంటూ ముందుకు వచ్చే శంకర్ గౌడ్ కు దేవుని ఆశీస్సులతో నిండు నూరేళ్ల వర్ధిల్లాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ సీనియర్ నాయకులు యాక చారి, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## అరకు మీద జనసేన జెండా...వైసీపీకి షాకేనా ?

ఏపీలో ఎక్కువగా ఎస్టీ అసెంబ్లీ సీట్లు ఉన్న ప్రాంతం ఉత్తరాంధ్రా. ఇక ఎస్టీ ఎంపీ సీటు కూడా ఉంది. ఎస్టీ నియోజకవర్గాలలో రాజకీయ ప్రాబల్యం మొదటి నుంచి కాంగ్రెస్ ది రాజకీయ ఆధిపత్యంగా ఉంటూ వచ్చింది. ఆ తరువాత విభజన నేపథ్యంలో కాంగ్రెస్ బలం అంతా వైసీపీకి మళ్ళింది. అలా వైసీపీకి గడచిన మూడు ఎన్నికల్లోనూ ఎస్టీలు పట్టం కట్టారు. మరీ ముఖ్యంగా అరకు ఎంపీ సీటు వైసీపీకి కంచుకోటగా నిలిచింది. 2024 ఎన్నికల్లో కూటమి మూడు పార్టీలు ఒక్కటిగా నిలిచినా కూడా వైసీపీ అరకు ఎంపీ సీటు రెండు ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుంది. ఇక అరకు పార్లమెంట్ పరిధిలో అరకు, పాడేరు, పాలకొండ, పార్వతీపురం, కురుపాం, సాలూరు, రంప చోడవరం అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఇందులో పార్వతీపురం ఎస్సీ సీటు తప్పించి మిగిలిన ఆరు ఎస్టీ నియోజకవర్గాలే. వైసీపీకి 2024లో తప్పించి మిగిలిన ఎన్నికల్లో ఈ సీట్లలో కూడా విజయం దక్కింది. టీడీపీ ఎన్నో ఎన్నికల్లో వైసీపీని ఢీ కొట్టింది. కానీ ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలలో అయితే గెలుపు దక్కలేదు. ఇపుడు జనసేన అరకు ఎంపీ పరిధిలో అన్ని అసెంబ్లీ సీట్లను గెలుచుకుంటామని గట్టిగా చెబుతోంది.జనసేనకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణ. జనసేనకు ఎక్కువగా ఉభయ గోదావరి జిల్లాలోనే బలం ఉంది అని చెబుతారు. అది కూడా 2019, 2024 ఎన్నికల్లో రుజువు అయింది. అయితే 2024 ఎన్నికలలో గెలిచి కూటమి ప్రభుత్వంలో చేరిన తరువాత జనసేన వ్యూహం మార్చింది. ఎస్టీ రిజర్వుడు సీట్ల మీద ఫోకస్ పెంచింది. దాంతో జనసేన ఇక్కడ పట్టు పెంచుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ అనేక సార్లు అరకు పాడేరులలో పర్యటించారు. అంతే కాదు పాలకొండ వెళ్లారు, పార్వతీపురం కూడా తిరిగారు. ఇక గిరిజన ప్రాంతాలకు నిధులు కేటాయించి రోడ్ల నిర్మాణానికి కూడా పవన్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా కీలక చర్యలు తీసుకున్నారు. పవన్ ఏజెన్సీ పర్యటనకు వచ్చినపుడల్లా గిరిజన యువతతో కలిసి పోతున్నారు. గిరిజన మహిళలతో పాటు వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడం రచ్చ బండ సమావేశాలు నిర్వహించడం వంటివి చేస్తున్నారు.ఇదిలా ఉంటే పవన్ అరకు మీద చూపిస్తున్న అభిమానం అలాగే ప్రభుత్వం తరఫున చేస్తున్న సాయం, అభివృద్ధి కార్యక్రమాలు ఇవన్నీ కూడా జనసేన అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జనసేనకు బలం ఇస్తాయని భావిస్తున్నారు. అంతే కాదు గిరిజన యువత కూడా ఎక్కువగా జనసేన పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని అంటున్నారు. ఈ మధ్య కాలంలోనే కీలక నేత కాంగ్రెస్ నుంచి జనసేనలో చేరిపోయారు. ఇలా అనేక మంది యువతరం నేతలు కూడా జనసేన తీర్థం పుచ్చుకున్నారు. దాంతో జనసేనలో ఆశలు పెరుగుతున్నాయని అంటున్నారు.మరో వైపు చూస్తే అల్లూరి జిల్లా జనసేన పార్టీ పరిశీలకుడిగా వ్యవహరిస్తున్న నాగబాబు పార్టీ నేతలతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అరకు పార్లమెంట్ పరిధిలోని మొత్తం సీట్లను జనసేన గెలుచుకోవాలని అన్నారు. అరకు ఎంపీ సీటు కూడా జనసేన పరం కావాలని అన్నారు. జనసేనకు ఏజెన్సీ ప్రాంతంలో పెరుగుతున్న ఆదరణతో పాటు ఉప ముఖ్యమంత్రిగా పవన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు గిరిజనులకు అందుతున్న ఫలితాలు అన్నీ కూడా జనసేన విజయానికి బాటలు వేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే అరకు పరిధిలో వైసీపీకి బలం గట్టిగానే ఉంది. మరి జనసేన రంగంలోకి దిగితే పవన్ సమ్మోహన శక్తితో గిరిజన ప్రాంతంలో రాజకీయ జాతకం మారుతుందా అన్నది చూడాల్సి ఉంది.

## ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ కు వెల్లువెత్తిన ప్రజా సమస్యలు.


### కూటమి నేతలతో కలిసి వినతులు స్వీకరించిన కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



**విజయవాడ పశ్చిమ జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఆదేశాలతో ఎన్డీయే కార్యాలయంలో నిరంతరం చేపడుతున్న ప్రజాదర్బార్ కార్యక్రమం అనూహ్య స్పందనతో కొనసాగుతుంది..కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి ప్రతి ఒక్కరి సమస్యను వింటూ పరిష్కారం చూపిస్తున్నారు.దుర్గమ్మ గుడి పరిసరాల్లో అనధికారికంగా రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న వారిని ఇటీవల కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు తమకు న్యాయం చేయాలని వారు కోరగా ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపెడతామన్నారు.. జోనల్ కమిషనర్ శ్రీనివాసరావుతో మాట్లాడి వారి వివరాలను సేకరించారు..ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరించారు.. పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు వైద్య సహాయం వంటి అంశాలపై వినతులు స్వీకరించారు .ప్రజల సమస్యలు తెలుసుకుంటూ మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రతి ఒక్కరూ ప్రజా దర్బార్ ను సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ అర్షద్ కోరారు..ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ మైనారిటీ మోర్చ ఉపాధ్యక్షురాలు పటాన్ షమీలా ఖాతూర్, 54 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు తారిక్ అజీజ్, 54 వ డివిజన్ జనసేన అధ్యక్షుడు బీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు..

## వత్సవాయి ఎంపీడీవో గా బి.రాజు నియామకం

**వత్సవాయి జులై 3 (వార్తప్రభ)** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా బి. రాజు శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు గతంలో సూపర్డెంట్ గా,ఇంచార్జ్ ఎంపీడీవో గా పెనుగంచిపోలు, చిలకల్లు, మండల పరిషత్ లో పనిచేసే ఉత్తమ అధికారిగా ప్రశంసలు అందుకున్నారు.ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ సిబ్బంది,



వివిధ శాఖల అధికారులు బి. రాజు కి పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బి. రాజు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రతిరోజూ వ్యర్థాల సేకరణ, శాస్త్రీయ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రతిరోజూ వ్యర్థాల సేకరణ, శాస్త్రీయ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సూర్యారావుపేట, గవర్నర్‌పేట, ప్రకాశం రోడ్, సింగ్‌నగర్, సుందరయ్య నగర్, విశాలాంధ్ర కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల సేకరణ, ప్రజలకు అందుతున్న పారిశుద్ధ్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఇంటింటా వ్యర్థాల సేకరణను తప్పనిసరిగా నిర్వహించి, సేకరించిన వ్యర్థాలను వెంటనే గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించి, అక్కడి నుంచి జిందాల్‌కోకు పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన రహదారులపై విధులు నిర్వహించే సమయంలో వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రహదారులపై కోన్లు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసి సురక్షిత వాతావరణంలో విధులు నిర్వహించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో ఎక్కడా చెత్త కుప్పలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. 2026 సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలకు అనుగుణంగా ప్రజలు తడి, పొడి, గృహ ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా అందించేలా ప్రతి వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిషనర్ తెలిపారు. వ్యర్థాల మూలస్థాయిలోనే విభజన జరిగితే శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ మరింత సమర్థవంతంగా అమలవుతుందని అన్నారు.తదుపరి సింగ్‌నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. అక్కడకు వచ్చే లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, భవనంలో లేదా ఇతర సౌకర్యాల్లో మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్యాంటీన్‌లో ఎల్లప్పుడూ తాగునీటి సరఫరా అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు పరిశుభ్రత నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, శానిటరీ సూపర్వైజర్ సలీం, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలి





**విజయవాడ పశ్చిమ జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను నియంత్రించేందుకు ప్రతి ఇంట్లో ఫ్రైడేను, డ్రై డే గా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం ఉదయం రాణి గారి తోట పరిసర ప్రాంతాలలో లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఆ ప్రాంతంలో గల ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా నగరంలో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఎక్కడ ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్ తో బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను, వ్యర్థాలను తొలగిస్తున్నారని, సిబ్బంది వెళ్లలేని చోట డ్రోన్ ని పంపించి ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవుకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.మరోవైపు నగర పరిధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్, మరి కొన్నిచోట్ల దోమల లార్వాని తినే గంబోజియా చాపలను విడుదల చేస్తూ నగరంలో దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒకవైపు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రతి ఇంట్లో దోమలు ఉత్పన్నం అవ్వకుండా డ్రైడే పాటించాలని అది ప్రతి శుక్రవారం పాటిస్తే ప్రతి ఇంట్లో దోమల సమస్యలు ఉండవని అన్నారు.ప్రతి శుక్రవారం తమ ఇంట్లో మరియు ఇంటి చుట్టు పరిసరాలలో ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా తొట్లు, వాడుక లేని బకెట్లు, మగ్గులు, డ్రమ్ములు, పూల కుండీలు, అలా ఏ వస్తువు అయినా వాడుకంలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి, ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీరుని పారవేస్తే ఇంట్లో దోమల సమస్య తగ్గుతుందని అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్లి నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయని చూపించి, వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు యూ. పి . హెచ్ .సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, శానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## చిట్టినగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగింపు




**విజయవాడ పశ్చిమ జూలై 3: (వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ చిట్టినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవాల ఐదవ రోజు ముగింపు ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఉదయం ధ్రువమూర్తి, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, తేనె, గంధం, పసుపు, కుంకుమలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తులసి మాలలు, గజమాలలు, వజ్రకవచం, బంగారు కిరీటంతో సుందరంగా అలంకరించి భక్తులకు దివ్య దర్శనం కల్పించారు.వసంతోత్సవంలో వందలాది మంది భక్తులు, ముఖ్యంగా మహిళలు, కోలాటాలు, గోవింద నామస్మరణలతో భక్తి పారవశ్యంలో పాల్గొన్నారు. అనంతరం హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు.సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీలో ఆలయ మాడవీధులు, పురవీధులలో ఊరేగించారు. భక్తులు తమ ఇళ్ల ముందు హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారిని



ఆహ్వానించారు. మహిళలు పల్లకీ సేవలో పాల్గొనగా, చిన్నారులు కోలాటాలతో ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.తదుపరి కళ్యాణ మండపంలో పవళింపు సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు, పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు, కొరగంజి భాస్కరరావు, పొట్లూరి రాజా, కామందు నరసింహారావు, పోతిన ధర్మారావు, పిళ్ళా విజయకుమార్, కమిటీ సభ్యులు, దేవస్థాన సిబ్బంది మరియు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## బిఎల్ఎలు, బి ఎల్ వోలు సమన్వయంతో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి



**విజయవాడ పశ్చిమ జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బిఎల్ఎలు, బి ఎల్ వోలు సమన్వయంతో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ ఈఆర్వో ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం గాంధీనగర్‌లోని కందుకూరి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై ఏఈఆర్వోలు, బీఎల్వోలు, బీఎల్వో సూపర్వైజర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేయడానికి అధికారులు, బీఎల్వోలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఏఈఆర్వోల దృష్టికి తీసుకువచ్చి అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్వో తన పరిధిలోని ప్రతి అర్హత గల ఓటరును సంప్రదించి ఫారాల పంపిణీ, సేకరణను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురోగతి సంతృప్తికరంగా కొనసాగుతోందని కమిషనర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4.00 గంటల నాటికి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 2,77,822 మంది ఓటర్లకు గాను 2,70,678 మందికి (97.43%) ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 77,319 ఫారాలు (27.83%) డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 2,69,734 మంది ఓటర్లకు గాను 2,63,926 మందికి (97.85%) ఫారాలు పంపిణీ చేసి, 81,236 ఫారాలు (30.12%) డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. అలాగే విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో కూడా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని పేర్కొంటూ, మిగిలిన ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్‌ను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఏఈఆర్వోలు, బీఎల్వోలు, బీఎల్వో సూపర్వైజర్లను ఆదేశించారు.ఈ సమావేశంలో ఏఈఆర్వో మరియు చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, సెంట్రల్ యం ఆర్ ఓ వి.దివ్య, సెంట్రల్ నియోజకవర్గం రాజకీయ పార్టీల బిఎల్ఎలు,సూపర్వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రి పై సంకష్టహర చతుర్థి గణపతి హోమం



**విజయవాడ పశ్చిమ జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పురాణాల ప్రకారం మానవులను కష్టాల నుండి గట్టెక్కించేది సంకటహర చతుర్థి ?పూజ. గణపతికి అత్యంత ప్రీతిపాత్రమైన తిథులలో ప్రధానమైనది చవితి.సంకటహర చతుర్థి పూజ ఆచరించడం వలన జాతకములోని సమస్యలు తొలగి,అన్ని పనులలో సంకటములన్నీ తొలగి సఫలత చేకూరుతుందనే పురాణోక్తి ప్రకారం ఆది పరాశక్తి, జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో సంకట హర చతుర్థి సందర్భంగా దేవస్థాన యాగశాలలో ఈరోజు ఉదయం గణపతికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం కార్యక్రమములను ఆలయ అర్చకులు వైభవంగా జరిపించారు. లోక క్షేమం కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అభిషేకం



**విజయవాడ పశ్చిమ జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కి అభిషేకాలు నిర్వహించామని శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, సహాయ అర్చకులు చింతలపాటి నాగ వెంకట పవన్ కుమార్ శర్మ తెలిపారు, శుక్రవారం మిల్క్ ప్రాజెక్ట్ భీమన వారి పేటలో వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రాత:కాలంలో ఉదయం ఏడు గంటల నుండి స్వామి వార్లకు పంచామృత అభిషేకం, కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు, ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారి పర్యవేక్షణలో నిర్వహించారు.

## అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే సందర్భంగా జూట్ సంచుల పంపిణీ






**విజయవాడ పశ్చిమ జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్లాస్టిక్ సంచులకు స్వస్తి పలుకుదాం, పర్యావరణ హిత సంచుల వినియోగాన్ని అలవాటు చేసుకుందాం అని విజయవాడ నగరపాలక సంస్థ జోనల్ కమిషనర్ కె. షమ్మీ అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్ కె. షమ్మీ శుక్రవారం పటమట ప్రాంతంలో ప్రజలకు జూట్ సంచులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒకసారి ఉపయోగించి పారేసే ప్లాస్టిక్ సంచులు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, జీవావరణాన్ని కలుషితం చేయడంతో పాటు ప్రజారోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని పూర్తిగా మానుకొని, జూట్, క్లాత్ వంటి పర్యావరణ హిత సంచులను వినియోగించే అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.విజయవాడ నగరపాలక సంస్థ నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. వ్యాపారులు, దుకాణదారులు నిషేధిత ప్లాస్టిక్ సంచుల విక్రయం, వినియోగాన్ని నిలిపివేసి ప్రత్యామ్నాయంగా జూట్, గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. ప్రజలు కూడా మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ఇంటి నుంచే పునర్వినియోగ సంచులు తీసుకెళ్లడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, ప్రజారోగ్యం విభాగం సిబ్బంది, పాల్గొన్నారు.

## జీవితాన రాణించాలి!

సమాధానమను బంధము
కల్గియుంటే అందము
లేదంటే జీవితము
అగును అతలాకుతలము
బ్రతుకులో దీర్ఘశాంతము
అత్యంత ప్రాముఖ్యము
క్షమాగుణము ఆయుధము
తరిమివేయు శత్రుత్వము
సంపూర్ణ వినయంతో
మెండైన సాత్వికంతో
వృత్తిలో రాణించాలి
కలుపుగోలుతనంతో
రావాలి దైవత్వము
పోవాలి దానవత్వము
ఈ సభ్య సమాజంలో



వెలగాలి జీవితంలో

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# జూలై 6న తిరుపతి జిల్లా సబ్ జూనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపికలు

**జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యామసుందరరావు యాదవ్**



**తిరుపతి, జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలను జూలై 6వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు బాలాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) తెలిపారు. ఈ మేరకు మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ, తిరుపతి జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ ఎంపికల్లో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు 2012 జనవరి 1వ తేదీ లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ వెంట జనన తేదీ ధ్రువీకరణ పత్రం (బర్త్ సర్టిఫికేట్ లేదా సంబంధిత ధ్రువీకరణ పత్రం) తీసుకురావాలని సూచించారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో తిరుపతి జిల్లా జట్టును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంపికైన బాల, బాలికలు ఈ నెల 11, 12 తేదీలలో ప్రకాశం జిల్లా జరుగుమల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్‌లో తిరుపతి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందుతారని పేర్కొన్నారు. జిల్లాలో టెన్నికాయిట్ క్రీడను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటుకునే వేదిక కల్పించడమే ఈ ఎంపికల ప్రధాన ఉద్దేశమని డాక్టర్ బండి శ్యామసుందరరావు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఎంపికలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం పైడి కోటేశ్వరరావు, పీడీని 7382111262 నంబర్‌లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహణ



**సంగం జూలై 03(వార్తాప్రభ ప్రతినిధి)** సంగంలోని స్థానిక రాళ్లచెలిక ప్రాంతంలో చీఫ్ కోఆర్డినేటర్ శంకర్ ఆధ్వర్యంలో వి.పి.ఆర్ నేత్ర ఉచిత కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య బృందం గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ నేత్ర శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ కంటి ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. నాణ్యమైన వైద్య సేవలు గ్రామస్థులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రారెడ్డి పర్యవేక్షించి ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థులు వి.పి.ఆర్ నేత్ర సేవలను అభినందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు.

# రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణను ఆపాలి..

**జీవో ఎంఎస్ నెంబర్ 396 రద్దు చేయాలి**
**ఇబ్రహీంపట్నంలో దస్తావేజు లేఖరుల ధర్నా**



**ఇబ్రహీంపట్నం, జులై 03 (వార్తా ప్రభ ప్రతినిధి):** రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ప్రైవేటీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. జీవో ఎంఎస్ నెంబర్ 396ను రద్దు చేయాలని కోరుతూ జిల్లా దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ ప్రభుత్వ చర్యల వల్ల దస్తావేజు లేఖరుల వృత్తి ప్రమాదంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖరుల లైసెన్సులను పునరుద్ధరించాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ఆపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలని కోరారు. దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల జీవనోపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలంలోని దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# డ్రైనేజీలో పడిన ఆవు



**సంగం జూలై 03(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం బస్ స్టాండ్ సెంటర్ సమీపంలోని డ్రైనేజీ కాలువలో ఓ ఆవు ప్రమాదవశాత్తు జారి పడింది. దీనిని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై పెద్ద తాళ్లు కట్టి ఎంతో శ్రమించి ఆవును సురక్షితంగా బయటకు తీశారు. స్థానికుల సమయస్ఫూర్తి చొరవతో ఆవుకు ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడగలిగారు. ఆవును సురక్షితంగా బయటకు తీసిన స్థానికుల సేవాభావాన్ని అక్కడున్న ప్రజలు అభినందిస్తూ వారి చర్యను ప్రశంసించారు.

# యూట్యూబర్ ప్రశ్న రావణ్ ను అరెస్టు చేసిన మచిలీపట్నం పోలీసులు.

**భారీ పోలీసు భద్రత.... న్యాయస్థానం ముందు హాజరు.**





**మచిలీపట్నం జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణకు చెందిన యూట్యూబర్ ప్రశ్న రావణ్‌ను మచిలీపట్నం పోలీసులు అదుపులోకి తీసుకుని ఇనుకుదురుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై జనసేన కార్యకర్తలు పలు ప్రాంతాల్లో చేసిన ఫిర్యాదుల మేరకు నమోదైన కేసుల నేపథ్యంలో ఈ చర్య చేపట్టారు. ఇప్పటికే ఇదే కేసుకు సంబంధించి హైదరాబాద్ నుంచి పిఠాపురానికి తరలించిన పోలీసు అధికారులు ఆయనను కోర్టులో హాజరుపరచగా బెయిల్ మంజూరైంది. అనంతరం మచిలీపట్నం ఇనుకుదురుపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసు విచారణ కోసం స్థానిక పోలీసులు రావణ్‌ను మచిలీపట్నానికి తీసుకువచ్చారు. రావణ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న విషయం తెలిసిన జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రావణ్‌పై దాడి జరిగే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసులు ఆయనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. పోలీస్ స్టేషన్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసి, భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు కార్యకర్తలు పోలీసుల ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను దాటి రావణ్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. మరికొందరు పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడ దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మచిలీపట్నం ఇనుకుదురుపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ప్రశ్న రావణ్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ పరీక్షలు నిర్వహించారు. న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. ఈ ఘటనతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా చిలకలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ నబి, ఇనకుదురు పేట పరమేశ్వర రావు, భారీ బందోబస్తు ఏర్పాటు చేసి కోర్టుకు హాజరు పరచడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు..



**మచిలీపట్నం జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మహిళకు తీవ్ర గాయాలు. మచిలీపట్నం బైపాస్ రోడ్డులోని గాయత్రి స్కూల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి తీవ్రంగా గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు ఘటన అనంతరం అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు వాహనాన్ని అడ్డుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# వ్యక్తిగత శుభ్రత పాటించాలి

**స్వచ్ఛత ఘన వ్యర్థాల నిర్వహణపై పారిశుధ్య కార్మికులకు శిక్షణ**



**ఇబ్రహీంపట్నం, జులై 03 (వార్తా ప్రభ ప్రతినిధి):** వ్యక్తిగత పరిశుభ్రత మరియు వాటి ప్రాధాన్యతపై మున్సిపల్ క పారిశుద్ధ్య కార్మికులకు సామర్థ్య వికాసం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛత, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, వ్యక్తిగత పరిశుభ్రత మరియు వాటి ప్రాధాన్యతపై పారిశుద్ధ్య కార్మికులకు సామర్థ్య వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లక్ష్యాలు, అమలు విధానం, ఫీల్డ్ స్థాయి డేటా సేకరణ, పౌర భాగస్వామ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, శుభ్రత ప్రమాణాలు, హోమ్ కంపోస్టింగ్, వ్యక్తిగత పరిశుభ్రత మరియు వాటి ప్రాధాన్యత గురించి శిక్షణ ఇచ్చారు. ప్రాక్టికల్ అంశాలు, ఫీల్డ్ అమలు చర్యలు, నివేదికల సమర్పణ విధానాన్ని వివరించారు. రాహుల్, సురేంద్ర, రోహిత్ పాల్గొన్నారు.

# నకిలీ నోట్ల ముఠా గుట్టు రట్టు చేసిన ఇబ్రహీంపట్నం పోలీసులు

● నకిలీ నోట్ల చలామణి కేసులో మరో ఇద్దరు నిందితుల అరెస్టు ● రూ.50 వేలు విలువైన నకిలీ 500 నోట్లు, రెండు ప్రింటర్లు, ల్యాప్ టాప్, స్కానర్, లామినేటర్, సెల్ ఫోన్లు స్వాధీనం ● త్వరగా కేసు చేదించిన ఇబ్రహీంపట్నం పోలీసులకు అభినందనలు ● మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన పశ్చిమ డీసీపీ జి.రామకృష్ణ





**ఇబ్రహీంపట్నం, జూలై 3 (వార్తా ప్రభ ప్రతినిధి):** నకిలీ నోట్ల చలామణి కేసులో మరో ఇద్దరు నిందితులను ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ రూ.500 (100) నోట్లు, వాటి తయారీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఈ నెల 1న ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు రూ.4.50 లక్షల విలువైన నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే! ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పశ్చిమ జోన్ డీసీపీ గుణ్ణం రామకృష్ణ కేసు వివరాలు వెల్లడించారు. అనంతపురం టౌన్ ఆదర్శ నగర్ కు చెందిన పుల్లాలరేవు రాజా (36), హిందూపూర్ న్యూ అసనాబాద్ కు చెందిన పొదిలి భాస్కర్ (46) కలిసి అనంతపురం పట్టణంలో ఒక రూమ్ అద్దెకు తీసుకుని పలు పరికరాల సాయంతో నకిలీ నోట్లు ముద్రిస్తున్నారు. ఇక్కడి నుంచి నకిలీ రూ.500 నోట్లు తెచ్చి ఇబ్రహీంపట్నం, విజయవాడ పరిసర ప్రాంతాల్లో చలామణి చేస్తున్న ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రధాన నిందితుడు గుంజ మంగారావును అరెస్టు చేసిన పోలీసులు విచారణలో అతను ఇచ్చిన సమాచారం మేరకు అనంతపురంలో ఉన్న నిందితులు పుల్లాలరేవు రాజా, పొదిలి భాస్కర్ లను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు ప్రింటర్లు, ఒక ల్యాప్ టాప్, ఒక స్కానర్, ఒక లామినేటర్, సెల్ ఫోన్లు, రూ.500 (100) నకిలీ నోట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితుడు రాజాపై దువ్వూరు, మైదుకూరు, బెంగళూరులోని సుబ్రహ్మణ్యపురం పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయని డీసీపీ రామకృష్ణ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్న మరో నిందితుడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు అయిన మరుసటి రోజే నేర చరిత్ర కలిగిన రాజాను, మరో నిందితుడు భాస్కర్ ను చాకచక్యంగా అరెస్టు చేసిన ఇబ్రహీంపట్నం సీఐ, స్టేషన్ సిబ్బందిని ఆయన అభినందించారు. రివార్డ్ కోసం కమిషనర్ కు సిఫార్సు చేస్తామని తెలిపారు. సమావేశంలో పశ్చిమ జోన్ ఏసీపీ దుర్గారావు, ఇబ్రహీంపట్నం సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, క్రైం ఎస్సై ఎస్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసిలు అందజేత ..



**విజయవాడ పశ్చిమ జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో ముఖ్యమంత్రి సహాయనిది నుండి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) లను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి అందజేశారు ..40 వ డివిజన్ , భవానీపురం కు చెందిన షేక్ మొహిద్దీన్ (51) యూరినల్ గాల్ స్టోన్ సమస్యతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు అతనికి మెరుగైన వైద్యం అందించాలని శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలపడంతో ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 4 లక్షల 60 వేల ఎల్ ఓ సీ ను బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.. 41వ డివిజన్, రంగూన్ సాహెబ్ వీధికి చెందిన మహమ్మద్ నజ్మా ( 20) రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమావగా మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ కొరకు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 1లక్ష 35 వేల ఎల్ ఓ సీ ను అందజేశారు. త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేయడంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుజనా కు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నేతలు నాగోతి రామారావు, పీవీ చిన సుబ్బయ్య, తారిక్ అజీజ్, బీ దుర్గా ప్రసాద్, గద్దిపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు..

# అవినీతి జోగి ఆపు నీ యాగి

**జోగి పై టిడిపి నాయకుల విమర్శలు**



**ఇబ్రహీంపట్నం, జూలై 03(వార్తా ప్రభ ప్రతినిధి):** జోగి రమేష్ ఒక అవినీతి చక్రవర్తి అని, పావలా వాటర్ కోసం ఆరాటపడుతున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు కొండపల్లి మున్సిపాలిటీ టిడిపి నాయకులు. శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జోగి రమేష్ ఆయన అనుచరులు స్థాయి మరియు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇసుక గురించి నీతులు జోగి రమేష్ చెప్పడం విడ్డూరంగా ఉందని, గత ప్రభుత్వంలో ఇబ్రహీంపట్నంలో మీ తమ్ముడి అవినీతి మర్చిపోవద్దని గుర్తు చేశారు. ఎన్నికల పోటీ కోసం వెళ్లి పెనమలూరులో ఇసుక దోపిడి చేసిన సంగతి మర్చిపోవద్దు అన్నారు. గత ప్రభుత్వంలో బూడిద మాఫీ అంతా జోగి అనుచరులే చేశారని, అధికారం పోగానే మీరు చేసిన అవినీతి మాయం అయిపోదని... చేసిన తప్పులు మర్చిపోవద్దని గుర్తు చేశారు. వ్యక్తిగత మైలేజ్ కోసం సొంత పార్టీని భ్రష్టు పట్టించిన ఘనత జోగి రమేష్ ది అన్నారు. సక్రమానికి అక్రమానికి తేడా తెలియకుండా గతంలో మంత్రి వి ఎలా అయ్యావు అని ఎద్దేవా చేశారు. ఏదో హడావుడి చేసి అరెస్టయి మైలేజ్ పెంచుకుందామని చూస్తున్నారు అన్నారు. పెడనలో మీ అవినీతి ప్రతి గోడ చెబుతుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు ధోరణికోట విజయలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి దుర్గారావు, క్లస్టర్ ఇంచార్జ్ మరియు కౌన్సిలర్ చనుమోలు నారాయణరావు, కౌన్సిలర్ ఉప్పతల గోపాలరావు, మున్సిపాలిటీ టిడిపి ప్రధాన కార్యదర్శి రావి ఫణి, సైదులు, పులి దాసు స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అండగా జనసేన నాయకుడు ఏఎన్ బాబు

**తన సంపాదనలో సగభాగం సమాజ సేవకే**



**కైకలూరు, జూలై 3(వార్తా ప్రభ)** రాజకీయాలకంటే సేవే పరమావధిగా భావిస్తూ, తన కష్టార్జిత సంపాదనలో సగభాగాన్ని సమాజ శ్రేయస్సు కోసం వెచ్చిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకుడు ఏఎన్ బాబు. నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి నిరంతరం అండగా నిలుస్తూ నియోజకవర్గ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. అల్లూరు ఉన్నత పాఠశాలలో నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీఈ సేవా కార్యక్రమంలో భాగంగా ముదినేపల్లి మండలం అల్లూరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏఎన్ బాబు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతోనే ఈ చిన్న సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. "సమాజ సేవలో తరించే జన్మ ధన్యం.. నా సంపాదనలో సగం పేదల కోసమే" అని ఏఎన్ బాబు పేర్కొన్నారు. ఏఎన్ బాబు సేవా కార్యక్రమాలపై నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి మరింతగా సేవ చేయాలని, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజాసేవ కొనసాగించాలని ఏఎన్ బాబు యువసేన సభ్యులు, స్థానికులు ఆకాంక్షించారు.

# ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయండి

**: ఓటర్ నమోదు అధికారి శారదా దేవి**





**తిరుపతి : జులై 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని రైల్వే కాలనీ, సుందరయ్య నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ (౦ఐతీ) ప్రక్రియను పరిశీలించారు. మీకు ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చారా? అని అడిగి తెలుసుకున్నారు. మీకు అందిన ఫారాలను వీలైనంత త్వరగా పూర్తి మా సిబ్బందికి ఇచ్చి సహకరించాలని తెలిపారు. ప్రజలకు ఓటర్ల సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. సర్వే నిర్వహణ, ఫారాల పంపిణీ, ఓటర్ల నమోదు ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడిటి సుధాకర్ నాయక్, జ్ఞాన కుమార్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, హరిమోహన్, బూత్ లెవెల్ అధికారులు, తదితరులు ఉన్నారు.

# ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడమే రైతు బజార్ల లక్ష్యం

● భారీ వర్షం తర్వాత గుడివాడ రైతు బజార్‌లో ఎమ్మెల్యే రాము ఆకస్మిక తనిఖీ..



**గుడివాడ,జూలై 3 (వార్తాప్రభ) :** ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, వినియోగదారుడికి నాణ్యమైన సరుకు అందించడమే రైతు బజార్ల లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గత రాత్రి కురిసిన భారీ వర్షం నేపథ్యంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం ఉదయం రైతు బజార్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రైతులు, సొసైటీల సభ్యులు, వ్యాపారులు, ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎంత వర్షం వచ్చినా రైతులు, వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాము సూచించారు. రైతు బజార్ ప్రధాన మార్గంలో కొందరు వ్యాపారులు చెత్త వేయడాన్ని గమనించిన ఎమ్మెల్యే రాము వారిని మందలించారు. గతంతో పోలిస్తే ఎంతో మార్పు సాధించామని, చిన్నపాటి నిర్లక్ష్యంతో మళ్లీ రైతు బజార్‌ను మురికి కూపంగా మార్చవద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, తప్పకుండా పరిష్కరిస్తానని వ్యాపారులకు భరోసా ఇచ్చారు. తీరు మార్చుకోకుంటే రైతు బజార్ ప్రధాన మార్గానికి ఇరువైపులా ఉన్న తోపుడుబండ్లను తొలగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో భాగంగా రైతు బజార్‌ను అభివృద్ధి చేశామన్నారు. తాము చేస్తున్న కృషిలో స్థానిక వ్యాపా రులు కూడా సహకరించాలని కోరారు. రైతు బజార్ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రతి రైతుకు గిట్టుబాటు ధర, ప్రతి వినియోగదారుడికి నాణ్యమైన సరుకు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు.

# గుడివాడను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● 28వ వార్డు ఇందిరా నగర్, న్యూ ఇందిరానగర్ కాలనీల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పర్యటన..



**గుడివాడ,జూలై 3 (వార్తాప్రభ) :** ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం 28వ వార్డు ఇందిరా నగర్ కాలనీ, న్యూ ఇందిరానగర్ కాలనీలలో పర్యటించారు. ఇందిరా నగర్ కాలనీలో వంటకాలువ ఆక్రమణకు గురవుతున్న సమ-స్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తరువాత న్యూ ఇందిరానగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. 20 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ కాలనీకి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రోడ్లు, డ్రైన్లు వేసి ఒక రూపు తెచ్చారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీ డౌన్ వైపు మిగిలి ఉన్న రెండు మూడు రోడ్లు కూడా వేస్తే తమ కాలనీలో రోడ్ల సమస్య సంపూర్ణంగా పరిష్కారం అవుతుందని స్థానికులు విజ్ఞప్తి చేశారు. రోడ్లు వేయకపోవడానికి గల అడ్డంకులు ఏమిటని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌కు విరుద్ధంగా ఆక్రమణలు చేసి ఇళ్లు నిర్మించుకోవడం వల్ల రోడ్లు ఉండాల్సిన స్థలంలో ఇళ్లు వచ్చాయని లేఅవుట్ మ్యాప్ చూపిస్తూ అధికారులు వివరించారు. సమస్య పరిష్కారంపై దృష్టి సారించిన ఎమ్మెల్యే రాము, ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ పరిస్థితుల ప్రకారం నూతన లేఅవుట్ రూపొందించాలని అధికారులకు సూచించారు. నూతన లేఅవుట్ పూర్తయిన వెంటనే రోడ్ల నిర్మాణానికి ప్రపోజల్స్ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. నూతన లేఅవుట్ ప్రకారం చిన్న చిన్న అడ్డంకులు ఎదురైతే స్థానిక ప్రజలు సహకరించాలని, ప్రజలందరి సహకారం ఉంటేనే అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే రాము కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, ఎం ఆర్ ఓ ప్రసాద్, డి.టి. కిరణ్, టౌన్ సర్వేయర్ బిఎస్‌పి మణికుమార్, మండల సర్వేయర్ అనురూప్, పట్టణ టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, జనసేన నాయకులు పందిళ్ళ మల్లి, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, రామదేని వేణు బాబు, స్థానిక టిడిపి నేతలు పులపర్తి డేవిడ్ బాబు, రెడ్డి అప్పారావు, కొడాలి రాజా, రఫీ, లంకపల్లి ప్రియనాధుడు, జయశ్రీ, మేరీ, శ్రీకాంత్, హనుమంతు, సచివాలయ ఉద్యోగులు, ఎమ్మెల్యే రాము వెంట పర్యటనలో పాల్గొన్నారు.

# మెంబర్షిప్ టు- లీడర్షిప్ జనసేన లక్ష్యం..

● జనసేన నేతలు.. సందు పవన్, పంచకర్ల అమర్



**గుడివాడ,జూలై 3 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమానికి గుడివాడ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, సారథులు, వీర మహిళలు పెద్ద ఎత్తున మచిలీపట్నం లోని సమాచార సేకరణ వేదిక వద్దకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నాయకత్వ బాధ్యతలు తీసుకునే ఔత్సాహికుల అర్జీలను మచిలీపట్నం పార్లమెంట్ వేదికగా పార్లమెంట్ పరిశీలకులు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ కు అందించడానికి ఈ రోజున గుడివాడ నియోజకవర్గం 100 మంది సారథులు, వీర మహిళలు, తరలి వెళ్ళామని, జనసేన పార్టీ నిర్మాణంలో తాము కూడా భాగస్వామ్యం కావాలనే ఆకాంక్షతో పార్టీ దృష్టికి తమ బయోడేటాలను సమర్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు. సందు పవన్, పంచకర్ల అమర్, కోయిలాపు రాము, పెద్ది కిషోర్, కూరపాటి విజయ్, కోటపల్లి దాసు, సయ్యద్ నజీర్, గంట వంశీ, గొల్లపల్లి నాగబాబు, గంటా చైతన్య, అర్జ కృష్ణ, రాజేష్ పరుచూరి, వాసా నవీన్, వంగలపూడి రాము, గాది కిరణ్, సీతాల రామకృష్ణ, గడ్డం క్రిష్ణ, వీర మహిళలు, సీతాల సుభాషిని, జడిమేను కనకదుర్గ, సూరత్ హిమజవల్లి, కొప్పర్తి విమల కుమారి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గుడివాడలో ఘనంగా మెకానిక్స్ డే వేడుకలు..

● ఆగిపోయిన వాహనానికి ప్రాణం పోసే వైద్యులు మెకానిక్స్ : ఎమ్మెల్యే రాము ప్రశంస



**గుడివాడ,జూలై 3 (వార్తాప్రభ) :** ఆగిపోయిన వాహనానికి ప్రాణం పోసే వైద్యులు మెకానిక్స్ అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కొనియాడారు. గుడివాడ టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్స్ డే వేడుకలు శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్యఅతిథిగా హాజరై అసోసియేషన్ పెద్దలతో కలిసి కేక్ కట్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ స్థాయిలో గళమెత్తుతున్న ఎమ్మెల్యే రాముకు అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, మెకానిక్ సోదరుల ఐక్యత గొప్పదని కొనియాడారు. మెకానిక్స్ సమస్యలను ఇప్పటికే అసెంబ్లీలో లేవనెత్తానని, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఇన్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలు, రాయితీలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ రంగప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సింహాచలం, ఉపాధ్యక్షుడు జ్యోతి బాబు, కార్యదర్శులు మధుబాబు, సింహాచలం, రామిశెట్టి బాలాజీ, రాహుల్, నరేంద్ర, శంకర్, అన్సారి, టిడిపి నాయకులు చేకూరి జగన్మోహనరావుతో పాటు పెద్ద సంఖ్యలో మెకానిక్ సోదరులు పాల్గొన్నారు.

# ఆర్జీయూకేటీ-నూజివీడులో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు రెండు రోజుల పాటు ఓరియెంటేషన్ కార్యక్రమం



**ఆర్జీయుకేటీ, నూజివీడు,జూలై 3 (వార్తాప్రభ) :** ఆర్జీయూకేటీ – నూజివీడు క్యాంపస్‌లో పీయూసీ కోర్సు పూర్తి చేసి ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలోకి ప్రవేశించనున్న విద్యార్థులకు ప్రత్యేక ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఈసీఈ, మెకానికల్, ఈఈఈ, సి.ఎస్.ఈ బ్రాంచ్ ఓరియెంటేషన్; శనివారం కెమికల్, ఎం.ఎం.ఈ, సివిల్ బ్రాంచ్ లకు ఓరియెంటేషన్ నిర్వహిస్తారు. పీయూసీ అనంతరం ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశించే విద్యార్థులకు అన్ని బ్రాంచ్‌ల పట్ల అవగాహన కలిగించడమే ఈ ఓరియంటేషన్ ప్రధాన ఉద్దేశం. ఆర్జియుకేటీ నూజివీడులో అందుబాటులో ఉన్న ప్రతి శాఖలో ఉన్న విద్యా అవకాశాలు, పరిశోధన, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను అధ్యాపకులు వివరించారు. ఇంజనీరింగ్ విద్యా విధానం, సెమిస్టర్ విధానం, అకడమిక్ నిబంధనలు, విద్యార్థి జీవితంలో పాటించాల్సిన క్రమశిక్షణపై మార్గనిర్దేశం చేశారు. సమయ పాలన, సమర్థవంతమైన అధ్యయన పద్ధతులు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, డిజిటల్ లెర్నింగ్, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత విద్యా సాధనాల వినియోగంపై సూచనలు అందించారు. అలాగే ఇన్నోవేషన్, స్టార్టప్‌లు, పరిశోధన, ప్రాజెక్టులు, హ్యాకథాన్‌లలో పాల్గొని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించు కోవాలని విద్యార్థులకు సూచించారు. క్యాంపస్‌లోని లైబ్రరీ, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలు, విద్యార్థి క్లబ్‌లను సద్వినియోగం చేసుకోవడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమంలో నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య గోపాలరాజు, అకడమిక్ డీన్ డా. చిరంజీవి, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావులతో పాటు అసోసియేట్ అకడమిక్ డీన్స్ పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విభాగాధిపతులు వినోద్, డా. శ్రీనాథ్, ప్రదీప్, ఉదయ్, రాజమోహనరెడ్డి, డా. మైథిలి, వీరశ్రీనులతో పాటు ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# వృత్తిపరమైన సామర్థ్యాలపై ఎ.ఎన్.ఆర్ కళాశాలలో వర్క్ షాప్



**గుడివాడ,జూలై 3 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో "వృత్తిపరమైన సామర్థ్యాలు" అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏలూరుకు చెందిన కార్పొరేట్ ట్రైనర్ ఎ.ఎస్.వి. నాగార్జున ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ సామర్థ్యాలను ఎలా గుర్తించాలి, ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలను ఎలా ఎంపిక చేసుకోవాలి, పరిశ్రమల్లో ప్రస్తుతం వినియోగిస్తున్న ఆధునిక సాధనాలు, సాంకేతికతలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కె.ఎస్. అప్పారావు, పాలకవర్గ అధ్యక్షుడు యల్.ఆర్.కే. ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# దళిత క్రిస్టియన్ ముసుగులో పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసింది రావణ్ చౌదరి : చలమలశెట్టి రమేష్ బాబు




**హనుమాన్ జంక్షన్,జూలై 3 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ అధినాయకుడు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై గత నెల 28 న ఏలూరు లో జరిగిన దళిత క్రైస్తవ సభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన రావణ్ చౌదరి అలియాస్ జోసెఫ్ రావణ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ ఐ శ్రీనివాస్ ఎం,కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇటువంటి దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఇతని ప్రసంగంలో కుట్రకోణం ఉందని అన్నారు. నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్న పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రావణ్ ను వెంటనే అరెస్ట్ చేయాలని మద్దా జయరాణి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళలు పరుచూరి సుజిని, సింగవరపు సూర్యావతి, బండారు లక్ష్మీ ప్రసన్న కొలసాని శివలీల,జనసేన నాయకులు వడ్డి శివ నాగేశ్వరరావు, అల్లాడిశెట్టి నాగేశ్వరరావు,మీసాల అర్జున్,అడపా సతీష్ ,వడ్డి తరుణ్,తోట శ్రీరామ్ వడ్డి చంద్రశేఖర్,వడ్డి అశోక్,, కే. హనుమంతురావు, కే జగదీష్, తెలుగు దేశం పార్టీ నాయకులు అట్లూరి శ్రీనివాస్,కొల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# కైకలూరు జనసేన ఇన్‌చార్జిగా అవకాశం కల్పించాలని కొల్లి బాబి వినతి

● ఏలూరు పార్లమెంట్ పరిశీలకుడికి దరఖాస్తు సమర్పణ



**కైకలూరు ,జూలై 3 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు కొల్లి వరప్రసాద్ (బాబి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కైకలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జిగా తనను నియమించాలని కోరుతూ ఏలూరు పార్లమెంటు పరిశీలకులు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు దరఖాస్తు సమర్పించారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయానికి, నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ సంచులు వద్దు - గుడ్డ సంచులే ముద్దు



**కృత్తివెన్ను,జూలై 3 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లిపాలెం నందు శుక్రవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం" సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగినది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ వి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూర్య ప్రకాష్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మన ఇచ్చే అద్భుతమైన బహుమతి ప్లాస్టిక్ రహిత పర్యావరణం అని ప్రతిరోజు ప్లాస్టిక్ టీ కప్పులు బజారుకు వెళ్లి కూరగాయలు మాంసం చేపలు తీసుకురావడానికి వాడే ప్లాస్టిక్ కవర్లను ప్రతినిత్యం వేలాదిగా వాడుతున్నామని, ఈ ప్లాస్టిక్ భూమిలో కలవాలంటే వేల సంవత్సరాలు పడుతుందని వాటివల్ల పాడిపంటలు విషతుల్యమవుతున్నాయని మనిషికి అంతులేని రోగాలు సంక్రమిస్తున్నాయని, నోరు లేని జంతువులు కూడా వీటి బారిన పడుతున్నాయని అందువల్ల ప్రతి ఒక్కరు కూడా ప్లాస్టిక్ ని నిషేధించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ప్లాస్టిక్ సంచులు వద్దు – గుడ్డ సంచులే ముద్దు అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా విద్యార్థులు తీసుకెళ్లాలని కోరారు .అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని ప్లకార్డులు ప్రదర్శించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యేసు పాదం మురళీకృష్ణ ప్రభ రేఖ దుర్గా జ్యోతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకండి.. భూమిని కాపాడండి




**గుడివాడ,జూలై 3 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ కలశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యాలు ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగినది ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.రవీంద్రబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టాలు కలుగుతున్నాయి. ఇవి భూమిలో కలవడానికి వందల ఏళ్లు పడుతుంది. ఫలితంగా నేల, నీరు కలుషితమై, వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది.అనంతరం వాలంటీర్లు ప్లాస్టిక్‌ను నివారిద్దాం పర్యావరణాన్ని కాపాడదాం, ప్లాస్టిక్ వాడకం కాన్సర్‌కు కారణం, ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం భూమాతను కాపాడుకుందాం అని నినాదాలు చేస్తు స్థానిక నెహ్రూ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి మార్గం మధ్యలో గల వ్యాపారులకు మరియు ప్రజలకు జూట్ సంచులను పంచుతూ, ప్లాస్టిక్ ప్రమాదాలను వివరిస్తూ, దాని గురించి అవగాహన కలుగచేసినారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పి.ఓ. టి.జె. సతీష్ చంద్ర, ఫ్లోర్ ఇన్‌ఛార్జ్ గంగాధర్ పాల్గొన్నారు.

# ఆం.ప్ర. విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ వేడుకలు




**గుడివాడ,జూలై 3 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో డాక్టర్లను ఘనంగా సన్మానించారు. డాక్టర్ డే సందర్భంగా సన్మాన గ్రహీతలు డాక్టర్ కరిమెళ్ళ వెంకటరావు, ముదినేపల్లి డాక్టర్ వి కోటేశ్వరావు, గవర్నమెంట్ హాస్పిటల్, గుడివాడ డాక్టర్ చీకటి లలికి గుడివాడ డాక్టర్ దిద్దుకోటి ఆర్ఆర్ మూర్తి గుడివాడ డాక్టర్ దుద్దుపూడి నారాయణమూర్తి, గుడివాడ కోడూరు శ్రీనివాసరావు, గుడివాడ ఘంటసాల త్రినాధ్, గుడివాడ అలమండ వెంకటేశ్వరరావు, గుడివాడ జై లక్ష్మీనారాయణ, గుడివాడ జై మురళీకృష్ణ, గుడివాడ అంబుల వైష్ణవి ముదినేపల్లి ఎంబిబిఎస్ ఫైనల్ స్టూడెంట్ ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చింతలూరు సత్యనారాయణ, గౌరీ శంకర్నాథ్, ఎలమంచి కోటేశ్వరరావు, అమృ పిక్చర్స్ రావు, ఆలూరు నాగేశ్వరావు, ఆమదా పట్నాల శాంతా చారి మహిళా సంఘం అధ్యక్షురాలు చింతల ఉమాదేవి తదితరులు పాల్గొని డాక్టర్లు ఘనంగా సత్కరించారు.

# స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా - ఏలూరు వెయిట్ లిఫ్టింగ్ అకాడమీకి ఎంపికైన ఇందిర ను అభినందించిన ఎం.పీ జి.ఎం. హరీష్ బాలయోగి..



**అమలాపురం,జూలై 3 (వార్తాప్రభ) :** అమలాపురం- హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ లో వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ పొందుతున్న ఎనమదల ఇందిర స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా – ఏలూరు వెయిట్ లిఫ్టింగ్ అకాడమీకి జూన్ నెలలో జరిగిన సెలక్షన్ ట్రైల్స్ లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి అగ్రస్థానంలో నిలిచి ఏలూరు వెయిట్ లిఫ్టింగ్ అకాడమీకి సెలక్షన్ అయినట్లు ఏలూరు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ గుమమ్ సింగ్ ద్వారా సెలక్షన్ ఉత్వరులు ఇందిర అందుకున్నట్లు కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈరోజు ఎం.పీ జి.ఎం హరీష్ బాలయోగి క్యాంప్ ఆఫీస్ వద్ద ఇండియాలో అత్యుత్తమ వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ అకాడమీల్లో ఒకటైన ఏలూరు వెయిట్ లిఫ్టింగ్ అకాడమీకి ఎంపికైన ఎనమదల ఇందిర దేశంలోనే అత్యుత్తమ వెయిట్ లిఫ్టర్ గా తర్ఫీదును పొంది, ఎందరికో ఆదర్శంగా నిలవాలని డ జీవితంలో స్థిరపడాలని ఎం.పీ. జి.ఎం హరీష్ బాలయోగి సన్మానించి, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో నేషనల్ వెయిట్ లిఫ్టర్స్ మారే వీరేంద్ర, వై. పల్లం రాజు, జి.దినేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

# యూ ట్యూబర్ రావణ్ పై జనసేన ఫిర్యాదు




**పెడన,జూలై 3 (వార్తాప్రభ) :** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడు మీద కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి పిఠాపురంలో అనుచిత వ్యాఖ్యలు దుర్భాషలు ఆడిన ప్రశ్న యూ ట్యూబర్ రావణ్ పై పెడన పోలీస్ స్టేషన్లో ఎంపీ అనుచరుడు గరికపాటి శివ ఆధ్వర్యంలో నియోజకవర్గ జనసైనికులు ఫిర్యాదు ఇవ్వటం జరిగినది. ఈ కార్యక్రమం లో నల్లమోతు రఘురామ్ ఊసా వెంకయ్య వరుదు రామకృష్ణ కూనపరెడ్డి రంగయ్య నాయుడు షఫీ తదితరులు పాల్గొన్నారు.

# వినతి స్థానికంగా.. పరిష్కారం సత్వరంగా..!

● విజయవాడ తూర్పులో విజయవంతంగా ప్రత్యేక గ్రీవెన్స్ ● స్థానిక ప్రజల నుంచి మొత్తం 86 అర్జీలు
● కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు




**విజయవాడ,జూలై 3 (వార్తాప్రభ) :** ప్రజలకు మరింత చేరువగా పరిపాలన అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఏపీఐఐసీ కాలనీ కల్యాణ మండపంలో ప్రత్యేక గ్రీవెన్స్‌తో పాటు ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 86 అర్జీలు వచ్చాయి. పురపాలక, పట్టణాభివృద్ధి 49, రెవెన్యూ 16, గృహ నిర్మాణం 3, విద్య 3, ఐసీడీఎస్ 3 అర్జీలు రాగా ఏపీఐఐసీ 2, పౌర సరఫరాలు 2 అర్జీలు వచ్చాయి. ఇదే విధంగా వివిధ శాఖలకు సంబంధించి మరో ఎనిమిది అర్జీలు వచ్చాయి. వీటిని క్షుణ్నంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జులై నెలలో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నాలుగు చోట్ల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా కూడా స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇప్పటికే మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించామని.. ఇప్పుడు విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిబద్ధతతో పరిశీలించి సమస్యను నాణ్యంగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో కూడా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ వ్యయం ఆదా కావడంతో పాటు, సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజలకు మరింత అందుబాటులో, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, పీజీఆర్ఎస్ సమన్వయకర్త జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ఆర్ఎఫ్ 36 లక్షలు అందించిన ఎం ఎల్ ఎ కాగిత



**పెడన,జూలై 3 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులు అత్యవసర వైద్య సేవలకు సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను ఈరోజు పెడన తోటమూల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు బాధితులకు అందజేసిన పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కంటినిండా కన్నీరు, గుండెనిండా నిరాశ వైద్య ఖర్చుల భారంతో కుంగిపోతున్న పేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. నియోజకవర్గంలోని బంటుమిల్లి, కృతి వెన్ను పెడన, గూడూరు మండలాలకు చెందిన 44 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 35,87,600/- విలువైన చెక్కులు అందజేయడం ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు నిరుపేదల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ శరవేగంతో సీఎం సహాయ నిధి మంజూరు చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. 'ప్రజల ఆరోగ్యం-ప్రభుత్వ బాధ్యత' అనే సంకల్పంతో ఆయన అందిస్తున్న ఈ సాయం వేలాది కుటుంబాలకు ప్రాణదాతగా మారుతోంది. మరోవైపు నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ నిరంతరం ప్రజాసేవలోనే గడుపుతూ బాధితులకు తక్షణమే స్పందిస్తున్నారు.

# ఏ ఎస్ ఎన్ క్రషర్ లో వెల్ఫేర్ గా పనిచేస్తున్నబాల కార్మికుడు అనుమానస్పద మృతి




**రౌతులపూడి,జూలై 3 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలం గిడజం గ్రామానికి చెందిన తంటపు రెడ్డి కొసరాజు అనే బాల కార్మికుడు అనుమానస్పద మృతి చెందాడు వీటిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్టు తల్లిదండ్రులు పేర్కొన్నారు సమగ్ర విచారణ జరిపి మా యొక్క కుమారుడు వివరాలను తెలియజేయాలని స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు కి తెలియచేసి గురువారం రాత్రి తెల్లవారుజామున రెండు గంటలకు మృతి చెందిన కొసరాజు పై ఎన్నో అనుమానాలు ఉన్నాయని వారి తల్లిదండ్రులు తెలియజేస్తూ ఇప్పటికీ 20 గంటలు కా వస్తున్న ఏ ఎస్ ఎన్ క్రషర్ యాజమాన్యం ఎటువంటి స్పందనలేదని స్పందన వచ్చేవరకు రోడ్డు బయట ఇస్తామని గ్రామాల్లో అభిమానులతో రహదారికి అడ్డంగా టెంట్ వేసి బయట యించారు రహదారులపై ప్రయాణిస్తున్న ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగించడంతో ప్రభుత్వ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఏఎస్ఎన్ క్రషర్ యాజమాన్యం వీటిపై స్పందించకపోతే ఇలానే రోడ్డు బయటయింపు కొనసాగుతుందని కుటుంబ సభ్యులు తెలియజేశారు ఎస్సై వెంకటేశ్వరరావు చొరవ చూపి విచారణ చేయాలని కోరారు ఇప్పటికీ 20 గంటలు కావస్తున్న వీటిపై ఎటువంటి చర్య లేదు అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు కుటుంబ సభ్యులు ఏ ఎస్ ఎన్ క్రషర్ సంఘటన స్థలానికి వెళ్లి అడగగా వారు వేరు వేరు కారణాలు చెప్పడంతో మరింత ఉద్రిక్త నెలకొంది శుక్రవారం ఉదయం నుంచి ఎమ్మార్వో నరేష్ ఎస్ఐ వెంకటేశ్వర్ రావు ఇంటిలిజెంట్ ఆఫీసర్స్ అదే గ్రామంలో ఉంటూ సెర్చ్ కు సమయతమయ్యారు

## కట్లపల్లి పాల సొసైటీ ప్రెసిడెంట్ గా అదంకి నాగ రమ్యశ్రీ



**పెడన,జూలై 3 (వార్తాప్రభ) :** పెడదాం మండలం కట్లపల్లి పాల సంఘం అధ్యక్షురాలుగా మహిళఏకగ్రీవంగా ఎన్నికయింది. శుక్రవారం నాడు సంఘ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘ సభ్యురాలు అద్దంకి నాగ రమ్యశ్రీని సభ్యులు ఎన్నుకున్నారు. కృష్ణ మిల్క్ యూనియన్ గుడ్లవల్లేరు చిల్లింగ్ సెంటర్ పరిధిలో ఈ సొసైటీ ఉంది.ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షురాలుని పలువురు అభినందించారు

## పసిడి మళ్లీ పరుగు.. రూ.1.50 లక్షల మార్కు దాటిన బంగారం

**విజయవాడ, జూలై 3 (వార్తాప్రభ) :** గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మళ్లీ ఒక్కసారిగా పుంజుకున్నాయి. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.3,300 మేర పెరిగి రూ.1,50,800కి చేరింది. దీంతో పసిడి ధర మరోసారి కీలకమైన రూ.1.50 లక్షల మార్కును దాటింది. అంతకుముందు రోజు ఈ ధర రూ.1,47,500 వద్ద ముగిసింది. బంగారంతో పాటు వెండి ధర కూడా భారీగా పెరిగింది. కిలో వెండి ధర రూ.5,000 వృద్ధి చెంది రూ.2,45,000కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల ధోరణులు దేశీయ ధరలపై ప్రభావం చూపాయి.

# లీ ఫార్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు మెగా ఉచిత వైద్య శిబిరం

● 'ప్రాజెక్ట్ స్మూత్‌వాక్--బ్రీతింగ్ బెల్'తో పోషకాహారం, ఆరోగ్యంపై మూడు రోజుల ప్రత్యేక అవగాహన




**విశాఖపట్నం,జూలై 3 (వార్తాప్రభ) :** కౌమారదశలో ఉన్న విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమైన్ సంస్థలు వడ్లపూడి కూర్మన్నపాలెంలోని జెడ్పీ హైస్కూల్‌తో కలిసి మూడు రోజులపాటు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. జూలై 1 నుంచి 3 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'ప్రాజెక్ట్ స్మూత్‌వాక్-బ్రీతింగ్ బెల్' పేరుతో పోషకాహార ఆధారిత శారీరక పరీక్షలు నిర్వహించడంతో పాటు మూడు నెలల పాటు కొనసాగే ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంపొందించుకోవాలని, రోజువారీ ఆహారంలో పోషక విలువలు అధికంగా ఉండే పదార్థాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. శిబిరంలో సుమారు 600 మంది విద్యార్థులకు ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలు, హ్యాండ్ గ్రిప్ స్ట్రెంత్, చేతి మధ్య భాగం చుట్టుకొలత, స్కిన్‌ఫోల్డ్ మందం, ట్యాపింగ్, ఫ్లెమింగో బ్యాలెన్స్ టెస్ట్ వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు, పోషకాహార నిపుణులు విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్య సూచనలు అందించారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సరోజిని, వైద్యులు డాక్టర్ శైలజ, డాక్టర్ మేఘన, న్యూట్రిషనిస్టులు మాధురి, క్రాంతి, జీఎన్ఎమ్ భాగ్యలత, యోగా మాస్టర్ అఖిల్ సూర్యతేజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింగరావు, ఉపాధ్యాయులు, లీ ఫార్మా బృందం పాల్గొన్నారు.

# సింగిల్ స్క్రీన్ థియేటర్లకు ఏపీ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రోత్సాహకాలు

● నిర్వహణ వ్యయం తగ్గించేలా సోలార్ పవర్ ఏర్పాటుకు తోడ్పాటు ● థియేటర్ల మనుగడకు పరిశ్రమతో పాటు ప్రభుత్వ సహకారం లభించేలా కృషి ● రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి దిశగా కార్యాచరణ ప్రణాళిక ● ఏపీ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడిగా ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ మిక్కిలి ప్రసన్న కుమార్ ● తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి ఏపీ ఫిలిం ఛాంబర్ తో కలిసి పనిచేస్తామని సఖి శక్తి వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ జయా పటేరియా ప్రకటన




**విజయవాడ,జూలై 3 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడకు అండగా నిలిచేందుకు ఏపీ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. థియేటర్ల నిర్వహణ వ్యయాన్ని తగ్గించే ఉద్దేశంతో సోలార్ పవర్ వ్యవస్థల ఏర్పాటుకు సహకారం అందించనున్నట్లు ఛాంబర్ ప్రకటించింది. అదే సమయంలో పరిశ్రమతో పాటు ప్రభుత్వ సహకారం కూడా థియేటర్లకు అందేలా కృషి చేస్తామని వెల్లడించింది. నగరంలోని హోటల్ ఫ్రైడ్ మాధవలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ మిక్కిలి ప్రసన్న కుమార్ను ఏపీ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధి, సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిరక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళికను వెల్లడించారు. ఈ సందర్భంగా ఛాంబర్ అధ్యక్షుడు శ్రీనివాస్ మంథా, ప్రధాన కార్యదర్శి చైతన్య జంగా మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో ఒకప్పుడు 1,400కు పైగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉండేవని, రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో 716, తెలంగాణలో 302 మాత్రమే మిగిలాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులు, నిర్వహణ వ్యయం పెరగడం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లు కొనసాగితే వేలాది మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో థియేటర్ల యాజమాన్యాలకు అవసరమైన మద్దతు అందించే దిశగా ఏపీ ఫిలిం ఛాంబర్ పనిచేస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సానుకూలంగా ఉందని, రాష్ట్రంలో సినిమా చిత్రీకరణలు పెరిగేలా మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తీసుకుంటున్న చర్యలు పరిశ్రమకు ఊతమిస్తాయని అన్నారు. రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ పునర్వైభవం సాధించేలా ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ భూషణ్ మార్గదర్శనంలో తాము ముందుకు సాగుతున్నట్లు మంథా శ్రీనివాస్, చైతన్య జంగా వెల్లడించారు. నవరంగ్ థియేటర్ అధినేత వి. భూపాల్ ప్రసాద్ మాట్లాడుతూ, చిత్ర పరిశ్రమ అభివృద్ధితో పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిరక్షణ కోసం ఏపీ ఫిలిం ఛాంబర్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. నూతన ఉపాధ్యక్షుడు డాక్టర్ మిక్కిలి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, సినీ రంగంపై ఉన్న అభిరుచితో ఈ బాధ్యతలు స్వీకరించానని, ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని చెప్పారు. సినీ పరిశ్రమకు చెందిన అన్ని విభాగాలకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడతామని తెలిపారు. సఖి శక్తి వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు జయా పటేరియా మాట్లాడుతూ, తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి ఏపీ ఫిలిం ఛాంబర్‌తో కలిసి పనిచేస్తామని చెప్పారు. మంచి కథాంశాలతో నిర్మించే చిత్రాలకు తమ వంతు సహకారం అందిస్తామని, సినీ పరిశ్రమలో మహిళల ప్రాతినిధ్యం, అవకాశాలు పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హీరోయిన్ అనయ కాశ్యప్, ఏపీ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ ఎల్. రాధా రాజేశ్వరి, ట్రెజరర్ ఎం. ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీలు పి. సోలమన్, పి. శిరీష, ఏపీ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోడె చైతన్య, వీఎఫ్ఎక్స్ నవీన్, డైరెక్టర్ చంద్రశేఖర్, రామిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జూనోటిక్ వ్యాధుల నివారణకు సమష్టి కృషి

● ప్రపంచ జూనోసిస్ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
● జూలై 6న ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం



**విజయవాడ, జూలై 3 (వార్తాప్రభ) :** ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జూలై 6న ఎన్‌టీఆర్ జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో ఉచిత రేబీస్ టీకాల కార్యక్రమం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 2026 జూలై 6న ఎన్‌టీఆర్ జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, ఎన్‌టీఆర్ జిల్లా తెలిపారు. జంతువుల నుండి మనుషులకు, అలాగే మనుషుల నుండి జంతువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అని పిలుస్తారని, వాటి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రేబీస్ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2026 జూలై 6న ఎన్‌టీఆర్ జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమీప పశు వైద్యశాలకు పెంపుడు కుక్కలను తీసుకువచ్చి ఉచిత రేబీస్ టీకాలు వేయించుకోవాలని కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, ఎన్‌టీఆర్ జిల్లా విజ్ఞప్తి చేశారు. రేబీస్ వంటి జూనోటిక్ వ్యాధులను నివారించడంలో సకాలంలో టీకాలు వేయించడం అత్యంత ప్రభావవంతమైన చర్య అని, ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. "ఆరోగ్యకరమైన జంతువులు -- ఆరోగ్యకరమైన మనుషులు -- ఆరోగ్యకరమైన పర్యావరణం" అనే One Health , వన్ సూత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించి జూనోటిక్ వ్యాధుల నివారణకు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. చంద్రశేఖరరావు, డా. సునంద, డా. మనోజ్, డా. పంకజ్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి అవస్థలపై బీసీ హాస్టల్ విద్యార్థుల వినతి

● స్పందించి హామీ ఇచ్చిన ఎంపీ. ● పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ను పంపి పరిస్థితి తెలుసుకున్న ఎంపీ.
● విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తానని హామీ ఇచ్చిన ఎంపీ, ధన్యవాదాలు తెలిపిన విద్యార్థులు.




**ఏలూరు, జూలై 3 (వార్తాప్రభ) :** జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ సమీపంలోని బీసీ హాస్టల్ లో ఉంటున్న విద్యార్థులు హాస్టల్ నుంచి తమ పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని వీడియో మెసేజ్ ద్వారా గురువారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎంపీ జంగారెడ్డిగూడెం పట్టణ టిడిపి అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ కి ఫోన్ చేసి మాట్లాడి, హాస్టల్ కి వెళ్ళి విద్యార్థుల సమస్యను పరిశీలించి రావలసిందిగా ఆదేశించారు. కొండ్రెడ్డి కిషోర్ వెంటనే పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోనేటి చంటితొ కలిసి జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమీషనర్ కె వెంకట రమణ, ఎమ్మార్వో జోజి, ఇతర అధికారులను వెంటబెట్టుకుని శుక్రవారం ఉదయం బీసీ హాస్టల్ కు వెళ్ళి హాస్టల్ నుంచి స్కూల్ కి వెళ్లే దారిని పరిశీలించారు. బీసీ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారు స్కూల్ కి వెళ్లే దారిని అధికారులతో కలిసి పూర్తిగా పరిశీలించడం జరిగింది. హాస్టల్ నుంచి స్కూలుకి వెళ్లేందుకు ఉన్న మట్టిదారి వర్షాలు పడినప్పుడు బురదమయంగా మారి, అడుగు తీసి అడుగు వేసేందుకు కూడా కష్టంగా మారిన దృశ్యాలను, అక్కడి పరిస్థితిని కొండ్రెడ్డి కిషోర్ బృందం ఎంపీకి ఫోన్లో వివరించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున వర్షాలు తగ్గగానే వీలైనంత త్వరగా ముందుగా గ్రావెల్ తోలించి తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేయిస్తానని, హాస్టల్ విద్యార్థులు స్కూలుకు వెళ్లేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాటు చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఈ సందర్భంగా విద్యార్థులకు హామీ ఇచ్చారు. సమస్యను తెలిచేయగానే వేగంగా స్పందించి హామీ ఇచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు, తమ సమస్యను ఎంపీకి వివరించి పరిష్కారానికి కృషి చేసిన పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ కి, కోనేటి చంటికి, బీసీ హాస్టల్ వార్డెన్ మరియు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# బెక్ మెకానిక్ల డిమాండ్లపై ఉద్యమ బాట...

**గుడ్లవల్లేరు,జూలై 3 (వార్తాప్రభ) :** మెకానిక్ డేను పురస్కరించుకుని గుడ్లవల్లేరు మండలంలోని బైక్ మెకానిక్స్ అందరూ శుక్రవారం తమ తమ డిమాండ్లపై తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్, ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణను కలిసి వినతిపత్రాలను అందించారు. అనంతరం తమ స్టేట్ లెవెల్ లీడర్లను సన్మానించేందుకు సభను నిర్వహించారు. కార్యక్రమంలో మెకానిక్‌లు ఎస్.శ్రీనివాసరరావు, సయ్యద్ సుభాని, సిహెచ్.ఉపేంద్ర, సురేంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188